

ఈవీఎంలు తీసుకు వెళుతున్న పోలింగ్ సిబ్బంది



సార్వత్రిక ఎన్నికల్లో కీలక ఘట్టమైన పోలింగ్ సోమవారం జరగనుంది. వివిధ ప్రాంతాల నుంచి ఓటర్లు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఓటేసేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ల ద్వారా, 85 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు హోం ఓటింగ్‌లో ఓటేశారు. మిగిలిన సాధారణ ఓటర్లు సోమవారం ఈవీఎం యంత్రాలలో మీట నొక్కి వారి తీర్పుని ఇవ్వనున్నారు. షెడ్యూల్, నోటిఫికేషన్, నామినేషన్లు, ప్రచారం ఇలా ఒక్కో అంకం దాటుకుంటూ వచ్చిన ఎన్నికల సమరం తుది ఘట్టమైన సోమవారం పోలింగ్ డేకి అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

ఓటేద్దాం..



నేటి పోలింగ్‌కు సర్వం సిద్ధం

- ప్రశాంత ఓటింగ్‌కు పటిష్ఠమైన ఏర్పాట్లు
- సమస్యాత్మక కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్.. సీసీ కెమెరాలు
- ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- సెక్టార్ల వారీగా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలతో తరలిన సిబ్బంది



పాత బస్టాండ్ దగ్గరలోని ఉర్దూ స్కూల్‌లో ఏర్పాటు చేసిన బారికేడ్లు



గుంటూరు ఏసీ కళాశాల నుంచి ఎన్నికల సామగ్రితో వెళుతున్న సిబ్బంది



గుంటూరు టీజేపీఎస్ కళాశాలలో ఎన్నికల సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న సిబ్బంది.



నరసరావుపేటలో కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, మే 12 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ విధులకు కేటాయిం చిన సిబ్బంది అంతా పంపిణీ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకుని ఆదివారం మధ్యాహ్నం నుంచి తమతమ పోలింగ్ కేంద్రాలకు తరలి వెళ్లారు. ప్రతి కేంద్రంలో 120 శాతం సిబ్బందిని అందుబాటు లో ఉంచారు. ఎక్కడ ఎటువంటి అవసరం వచ్చిన అందు బాటులో ఉండేలా రిజర్వ్ సిబ్బందిని కూడా నియమించారు. ఎక్కడైనా ఈవీఎంలు పనిచేయకపోతే వాటి స్థానంలో ఏర్పాటు కు 20 శాతం అదనంగా సిద్ధం చేశారు. ఓటింగ్ ప్రక్రియ మొత్తం ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి పూర్తి పారదర్శకంగా జరగాలని ఎన్నికల అధికారులు ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ బూత్‌ల వెలుపల జనం గూమికూడకుండా ఉండేందుకు ఆయా ప్రాంతాల్లో 144 సెక్షన్‌ని అమలు చేయనున్నారు. రాజకీయ పార్టీలు పోలింగ్ బూత్‌కు 200 మీటర్ల వెలుపలే ఉండి పరిశీలిం చుకోవాలి. పోలింగ్ కేంద్రాలను పరిశీలించడానికి అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లకు మాత్రమే అనుమతి ఉంది. అభ్యర్థులు తిరగడానికి మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఇచ్చారు. ఒక వాహనంలో డ్రైవర్‌తో కలిపి ఐదుగురికి మాత్రమే ఎన్నికల కమిషన్ అనుమతి చ్చింది. జిల్లా కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే సంఘటనలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఏదైనా సంఘటన జరిగితే దగ్గరలో ఉన్న అధి కారులకు తెలిపి వెంటనే తగు చర్యలు తీసుకునేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఎక్కడైనా అవాంఛనీయ సంఘటనలు జరిగితే వెంటనే అక్కడికి చేరుకుని పరిస్థితులను చక్కబరచడానికి క్విక్ రెస్పాన్స్ టీం, రాపిడ్ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేశారు.

స్లిప్పులు లేకపోయినా ఓటు..

ఓటరు తన పోలింగ్ బూత్, సీరియల్ నెంబరు తెలుసుకుని ఏదైనా గుర్తింపు కార్డుతో కేంద్రానికి వెళితే ఓటు వేయడానికి అనుమతిస్తారు. స్లిప్పులు పొందలేకపోయిన వారు ఓటరు ఐడీ కార్డు తీసుకుని బూత్ వద్దకు వెళితే అక్కడి సిబ్బంది చూసి ఓటర్ స్లిప్పుని అప్పటికప్పుడు ప్రింట్ తీసి ఇస్తారు. ఓటరు కార్డుకు ప్రత్యామ్నాయంగా 12 రకాల



ఏఎన్‌యూలోని రిసెప్షన్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గుర్తింపుకార్డులు తీసుకువెళ్లడానికి ఎన్నికల కమిషన్ అనుమతి ఇచ్చింది. వీటిలో ఆధార్‌కార్డు, ఉపాధిహామీ జాబ్‌కార్డు, పాస్‌బుక్, ఆరోగ్యబీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్సు, పాస్‌పోర్టు, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్ తదితర కార్డులను ఓటు హక్కు వినియోగం కోసం గుర్తింపు కార్డుగా అనుమతిస్తామన్నారు సాయంత్రం ఆరు గంటల లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలోకి ఎవరైతే ప్రవేశిస్తారో వారికి మాత్రమే టోకెన్ నెంబర్లు ఇచ్చి ఎంత సమయమైనా ఓటు వేయడానికి అవకాశం కల్పిస్తారు. సెల్‌ఫోన్లను పోలింగ్ కేంద్రాల ఆవరణలో నిషేధించారు. పోలింగ్ బూత్‌లు లొకేషన్‌కు ఒక హెల్ప్ డెస్కును ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి పోలింగ్ బూత్‌లో తాగు నీటి వసతి, విద్యుత్ సౌకర్యం, బారికేడింగ్,



బస్సుల్లో బయలుదేరుతూ.

క్యూలైన్‌లు, వీటిపై షామియానాలను ఏర్పాటు చేశారు. దివ్యాంగుల కోసం వీల్‌చైర్లను పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేశారు.

పటిష్ఠ నిఘా.. పలువురు బైండోవర్

మున్సిపాల్టీలు, గ్రామాల్లో ప్రశాంత ఎన్నికలకు ముందస్తు చర్యల్లో భాగంగా వేలాది మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. సమస్యాత్మక కేంద్రాల్లో పోలింగ్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. సీఆర్‌పీఎఫ్ సిబ్బందిని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో బందోబస్తుకు నియమించారు. శాంతియుత వాతావరణంలో ఓటింగ్ ప్రక్రియ సాగడానికి పెద్దసంఖ్యలో పోలీసు బలగాలను మొహరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలతో పాటు ప్రతి చోట పటిష్ఠ నిఘా పెట్టి పోలింగ్ ప్రక్రియను పోలీసులు పర్యవేక్షించనున్నారు. లోపల వెబ్‌కాస్టింగ్ ఉంటే బయట సీసీ కెమెరాలతో కదలికలను పోలీసులు గమనించ నున్నారు. నేర చరిత్ర ఉన్నవారిని ఇప్పటికే బైండోవర్ చేసిన పోలీసు శాఖ హద్దుదాటితే కఠిన చర్యలు తప్పవనే హెచ్చరి కలు జారీ చేసింది. రాజకీయ పార్టీల అనుచరులు సైతం రెచ్చగొట్టేలా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని, ప్రజలంతా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగిం చుకునేలా చూడడమే తమ ధ్యేయమని పోలీసు శాఖ చెబుతోంది.

మొత్తం ఓటరు 17,20,526

గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 17 లక్షల 91 వేల 543 మంది ఓటర్లు వారి ఓటు హక్కుని వినియోగించుకోనున్నారు. ఇందుకోసం జిల్లా వ్యాప్తంగా 1915 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో 32 సమస్యాత్మకమైనవిగా గుర్తించి వాటి వద్ద అదనపు పోలీసు బందోబస్తుని ఏర్పాటు చేశారు. 1309 చోట్ల వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారు. ఓటర్లలో ఇప్పటికే 1386 మంది 85 ఏళ్ల వయస్సు దాటిన వారు, 906 మంది దివ్యాంగులు, అత్యవసర సేవల్లో ఉన్న 486 మంది, పోలింగ్ రోజున విధుల్లో ఉండే 20399 మంది ఇప్పటికే పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకున్నారు. గుంటూరు లోక్‌సభ స్థానానికి 30, అసెంబ్లీ నియోజకవర్గాలైన తాడికొండలో 10, మంగళగిరిలో 40, పొన్నూరులో 14, తెనాలిలో 13, ప్రత్తిపాడులో 13, గుంటూరు పశ్చిమలో 28, గుంటూరు తూర్పులో 14 మంది అభ్యర్థుల ఎన్నికల బరిలో నిలిచారు. పోలింగ్ సజావుగా నిర్వహించడానికి జిల్లా యంత్రాంగం చాలావరకు ఏర్పాట్లు చేసింది. ఒక్కో సెక్టార్‌లో 3 బస్సులను, ఒక పోలీసు ఎస్కార్ట్‌ని ఏర్పాట చేశారు. పోలింగ్ ముగిసిన తర్వాత కూడా సెక్టార్ల వారీగా బస్సులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌కు చేరుకుంటాయి. ఇందుకోసం 145 ఆర్‌టీసీ, 330 ప్రైవేటు, టాటా మేజిక్ 20 వాహనాలు కలిపి మొత్తం 495 ఏర్పాటు చేశారు. పోలింగ్ సిబ్బందికి సంబంధించి 2,300 మంది చొప్పున పీవో, ఏపీవోలు, 9,200 మంది ఓపీవోలు, 487 మంది మైక్రో అబ్జర్వర్లు, 176 మంది సెక్టారు ఆఫీసర్లను కలిపి మొత్తం 14,287 మందిని నియమించారు.

పోలింగ్‌కు నాలుగంచెల భద్రత

పల్నాడు జిల్లాలో ప్రశాంత పోలింగ్‌కు పోలీసు శాఖ నాలుగంచెల భద్రతను ఏర్పాటు చేసింది. సుమారు 6,000 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. 20 కంపెనీల కేంద్ర భద్రతా బలగాలను రపించారు. పోలింగ్ కేంద్రాల వద్ద స్టాటిక్ ఫోర్స్, ఎస్ఐ స్థాయి అధికారితో రూట్ మొబైల్ పార్టీ, సీఐ స్థాయి అధికారితో మండల పరిధిలో స్ట్రైకింగ్ ఫోర్స్, డీఎస్పీ స్థాయి అధికారితో నియోజకవర్గ స్థాయిలో స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌గా నాలుగంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. వీరి పర్యవేక్షణకు ప్రతి నియోజకవర్గానికి అదనపు ఎస్పీ స్థాయి అధికారి అదనపు స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌తో సిద్ధంగా ఉంచారు. 558 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించి ఆయా కేంద్రాలకు ప్రత్యేకంగా కేంద్ర పారా మిలిటరీ బలగాలను బందోబస్తుకు నియమించారు. మాచర్ల నియోజకవర్గానికి ఎస్పీ స్థాయి అధికారిని, ఇతర నియోజకవర్గాలకు అదనపు ఎస్పీ స్థాయి అధికారులను ఇన్ చార్జిలుగా నియమించారు. ఎస్పీ బిందు మాధవ్ పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రతి ఒక్క ఓటరు ప్రశాంత వాతావరణంలో వారి ఓటు హక్కు వినియోగించుకోవాలని బిందు మాధవ్ కోరారు. ఎవరైనా అవాంఛ నీయ సంఘటనలకు చట్ట వ్యతిరేక మైన కార్య కలాపాలకు పాల్పడ డానికి ప్రయత్నిస్తే వారిపై కఠినచర్యలు తీసుకుంటా మని ఆయన హెచ్చరించారు.



తెనాలి: ఓ పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు



మంగళగిరి : మధ్యాహ్నం కురిసిన వానకు సీకే హైస్కూల్‌లో నేలవాలిన టెంటు

టెన్షన్ టెన్షన్



- ఓటరు నాడిపై అభ్యర్థుల్లో ఆందోళన
- చివరి ప్రయత్నంగా బుజ్జగింపులు, ప్రలోభాలు
- పోలింగ్ ముందు రోజూ విచ్చలవిడిగా వైసీపీ నగదు పంపిణీ
- డబ్బులు అందలేదని పార్టీ కార్యాలయాల వద్ద ఓటర్ల పడిగాపులు

బాపట్ల, గుంటూరు, మే 12 (ఆంధ్రజ్యోతి): ప్రచారం ముగిసింది.. ఓటనే ఆయుధంతో ఓటర్లు సిద్ధంగా ఉన్నారు. ఈవీఎంలలో ఏ గుర్తుపై ఓటర్లు బటన్ నొక్కుతారనే టెన్షన్‌లో అభ్యర్థులు ఉన్నారు. ఇక పెద్దఎత్తున నగదు పంపిణీపై ప్రచారాల నేపథ్యంలో తమకు ఆ మొత్తాలు అందలేదనే ఆందోళనలో ఓటర్లు ఉన్నారు. సుమారు రెండు నెలల నుంచి విస్తృతంగా ఏర్పాట్లు చేసిన అధికారులు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతం నిర్వహించాలనే టెన్షన్‌లో అధికారులు ఉన్నారు. మొత్తం మీద అటు అభ్యర్థులు ఇటు అధికారులు మధ్యలో ఓటర్లు అందరూ కూడా వారివారి రీతుల్లో టెన్షన్‌లో ఉన్నారు. మరికొద్ది గంటల్లో పోలింగ్ బూత్‌లు తెరుచుకోనుండగా ఓటర్లు ఈవీఎంలలో మీట నొక్కేందుకు సిద్ధమయ్యారు. ప్రచారం గట్టిగానే చేశాం.. ప్రత్యర్థి పార్టీలోని అసమ్మతి నాయకులను గుర్తించి మద్దతు పొందగలిగాం.. ప్రజల్లో ఆదరణ బాగానే ఉంది.. తెరవెనక పంపకాలను బాగానే చేశాం.. ఓటరు నాడీ ఏ తీరున ఉండోననే సందేహంతో అభ్యర్థుల్లో ఆందోళన. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే తమను ఎన్నికల గండం గట్టెక్కిస్తాయన్న భరోసా పాలకపార్టీ నేతలది. వీటి నేపథ్యంలో సోమవారం పోలింగ్ జరగనుండడంతో ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థుల్లో ఓటర్ల నాడిపై విస్తృతంగా చర్చ నడిచింది. ప్రచారానికి శనివారం సాయంత్రమే తెరపడడంతో ఆదివారం మొత్తం కీలక నేతలతో మంతనాలు, పోలింగ్ బూత్‌లకు తమ ఓటర్లను తరలించడానికి చేయాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై కసరత్తు చేశారు. కొన్ని దగ్గర్ల ప్రలోభాల పర్వాలు కూడా కొనసాగాయి. ద్వితీయశ్రేణి నేతల్లో ముఖ్యమైన వారితో అంతర్గత సమావేశాలను ఆదివారం అభ్యర్థులు ఏర్పాటు చేసుకున్నారు. పంపకాల పర్వం అంతా సజావుగా జరిగిందా లేదా అని ఆరా తీయడంతో పాటు పోలింగ్ రోజు ప్రత్యర్థిపార్టీల ఎత్తుగడలు ఎలా ఉండనున్నాయి అనే కోణంలో కూడా నేతలతో సమీక్ష జరిపి తాము అనుసరించాల్సిన వ్యూహాలను కూడా వారికి చెప్పారు. సోమవారం పోలింగ్ డే కావడంతో అభ్యర్థులంతా ఓటింగ్ సరళిపైనే దృష్టి పెట్టనున్నారు. ప్రత్యర్థిపార్టీలకు పట్టు ఉన్న బూత్‌లపై ఇరుపార్టీలు ప్రత్యేకంగా దృష్టి సారించాయి.

కొనసాగిన పంపకాలు

ఓటర్లకు ప్రలోభాలు ఆదివారం కూడా కొనసాగాయి. నగదుతో ఎలాగైనా ఓటుని కొనుగోలు చేసేందుకు అధికార వైసీపీ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నది. ఇంకా ఎవరికైనా నగదు ఇవ్వకపోయి ఉంటే వారికి సోమవారం అయినా ఇస్తామని చెబుతూ ప్రలోభ పెడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి మఫ్టీ పోలీసులు తిరిగారు తప్ప పెద్దగా డబ్బు, మద్యం పంపిణీని అరికట్టలేకపోయారు. కొందరైతే చూసీచూడనట్లుగా వదిలేశారు. దీంతో వైసీపీ కార్యకర్తలు యథేచ్ఛగా డబ్బు పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసేందుకు ప్రయత్నించారు. వైసీపీ ఈ దఫా పూర్తిగా ఓటర్లకు డబ్బు పంపిణీ పైనే ఎన్నికల్లో ఆధారపడింది. ఇందుకు కారణం తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రకటించిన మేనిఫెస్టో ముందు ఆ పార్టీ హామీలు తేలిపోయాయి. కాగా వైసీపీ ఇచ్చిన మేనిఫెస్టో గురించి ఎక్కడా చర్చ కూడా జరగలేదు. దీంతో ఆ పార్టీ అభ్యర్థులంతా ఓటర్లకు నగదు పంపిణీ చేసి ఎలాగైనా గెలువాలని కుతంత్రాలు చేస్తూనేఉన్నారు. ఓటుకు రూ.వెయ్యి నుంచి గరిష్ఠంగా రూ.3,500 వరకు నియోజక వర్గాన్ని బట్టి పంపిణీ చేశారు. కొన్ని చోట్ల తమకే ఓటు వేయాలని ప్రమాణం చేయించుకున్నారు. కాగా కొంతమంది అభ్యర్థుల అనుచరులు ఓటర్లకు డబ్బు పంచుతామని నేతల వద్ద తీసుకుని వాటిని నొక్కేశారు. దాంతో ఆదివారం పలువురు అభ్యర్థుల ఆఫీసుల, వార్డుల్లోని పార్టీ కార్యాలయాల ఎదుట ఓటర్లు పడిగాపులు కాశారు. సాయంత్రం వరకు వేచి చూసి ఓపిక నశించి శాపనార్థాలు పెట్టుకుంటూ వెనుదిరిగారు.



పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరా అపహరణ

కారంపూడి: మండలంలోని పేటసన్నిగండ్ల శివారు సింగరుట్లతండాలోని ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేశారు. అయితే శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కేంద్రంలోని సీసీ కెమెరా, కేబుల్ వైరును అపహరించారు. అత్యంత సమస్యాత్మక నియోజకవర్గమైన మాచర్ల పరిధిలో 299 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేసింది. ఆదివారం ఉదయం కేంద్రానికి వచ్చిన ఎన్నికల సిబ్బంది సీసీ కెమెరా, కేబుల్ వైరు అపహరణకు గురై ఉండటాన్ని గుర్తించి ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రామాంజినేయులు కేసు నమోదు చేశారు. పోలింగ్ కేంద్రంలో మరో సీసీ కెమెరా, కేబుల్ వైరు ఏర్పాటు చేశారు.

ఓటు వేసిన వెంటనే వెళ్లేందుకు ప్రణాళిక

ఇతర ప్రాంతాల నుంచి ఓటు వేసేందుకు జిల్లాకు వచ్చిన వారు ఓటు వేసిన వెంటనే వెళ్లిపోయేందుకు సిద్ధమయ్యారు. సోమవారం సాయంత్రం వరకే సెలవు కారణంగా ఎంత తొందరగా వీలైతే అంత తొందరగా ఓటు వేసి వెళ్లాలనే ఆలోచనలో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ఓటర్లు ఉన్నారు. ఆది వారం రైల్వే రిజర్వేషన్ బుకింగ్ కౌంటర్ల వద్ద తత్కాల్ సమయంలో విపరీతమైన డిమాండ్ తలెత్తింది. వేజండ్ల లాంటి చిన్న రైల్వేస్టేషన్‌లోనే 40 వరకు తత్కాల్ ఫారంలను ప్రయాణికులు పెట్టారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అయితే వారిలో కేవలం 10 మందికి మాత్రమే బుకింగ్ అయ్యాయి. సోమవారం మధ్యాహ్నం జన్మభూమి ఎక్స్‌ప్రెస్ నుంచే తిరుగు ప్రయాణాలు ప్రారంభం కానున్నాయి. రైల్వే శాఖ రెగ్యులర్ రైళ్లతో పాటు గుంటూరు మీదగా సికింద్రాబాద్‌కు సోమవారం ఏడు ప్రత్యేక రైళ్లను నడపబోతోన్నది. అలానే ఏపీఎస్‌ఆర్‌టీసీ, టీఎస్‌ఆర్‌టీసీ కూడా వందల సంఖ్యలో స్పెషల్స్‌ని ఏర్పాటు చేశాయి.

ఓటు.. నోటు.. యాప్

గుంటూరులో వైసీపీ సాంకేతిక రాజకీయం

ఓటర్లకు డబ్బు పంపిణీ చేసేందుకు గుంటూరు పరిధిలోని ఓ కీలక నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి సాంకేతిక తను ఉపయోగించుకున్నారు. సాఫ్టువేర్ కంపెనీలు ఉన్న ఆ అభ్యర్థి ప్రత్యేకంగా ఓ యాప్‌ని తయారు చేయించి వైసీపీ కార్యకర్తల స్మార్ట్‌ఫోన్లలో ఇన్‌స్టాల్ చేయించారు. ఆ యాప్‌లో నియోజకవర్గ ఓటర్ల వివరాలను చేర్చారు. ప్రతీ ఇంటికి వైసీపీ కార్యకర్తలు వెళ్లి ఆ యాప్‌ని ఓపెన్ చేసి అందులో పోలింగ్ బూత్, సీరియల్ నెంబరు వారీగా ఓటరు వివరాలను శోధించి ఓటుకు రూ.2 వేల చొప్పున పంపిణీ చేశారని సమాచారం. పంపిణీ అనంతరం ఓటరు సీరియల్ నెంబరు పక్కన టిక్ మార్కు చేశారు. ఆ సమాచారం రియల్‌టైంలో యాప్‌లో అప్‌లోడింగ్ చేశారు. ఈ విధంగా ఒక ఓటరుకు ఒకసారి మాత్రమే డబ్బు పంపిణీ చేసేలా స్కెచ్ వేసి అమలు చేశారు. ఈ విధంగా వైసీపీ కేవలం నగదు పంపిణీ పైనే ఆధారపడింది. కాపు సామాజికవర్గం నేతల వద్దకు ఆ పార్టీ నాయకులు వెళ్లి ఇక్కడ జనసేన పోటీ చేయడం లేదు కాబట్టి ఓటు మాకే వేయాలని, రేపు కూటమి అధికారంలోకి వస్తే తాము పార్టీ మారతామని చెప్పారు. అయితే అందుకు వారు అంగీకరించలేదని తెలిసింది.

ఉద్యానానికి ఉరి



ఉద్యాన పంటలకు రాయితీలు, ప్రోత్సాహకాలతో 2014 నుంచి 2019 వరకు ఉద్యాన పంటల సాగు విషయంలో ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులకు స్వర్ణయుగం నడిచింది. క్రమం తప్పకుండా రాయితీలు అందించడంతో పాటు ఎక్కువమంది రైతులను ఉద్యాన పంటల సాగు వైపు మళ్లించడానికి అప్పటి ప్రభుత్వం పెద్ద యజ్ఞమే చేసింది. దాదాపు రూ.100 కోట్లపైనే అప్పటి ప్రభుత్వం ఒక్కో జిల్లాకు రాయితీల కోసం వెచ్చించింది. ఈ ఫలితంగా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 80,000 హెక్టార్ల వరకు ఉద్యాన పంటల సాగు వెళ్లింది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అసలు ఉద్యాన పంటలు, సాగు గురించే ఆలోచించలేదు. దీంతో పాటు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చినా వారికి ప్రోత్సాహం అందించలేదు. పైగా రాయితీలు ఇవ్వకుండా నానుస్తూ వచ్చింది. దీంతో ఈ ఐదేళ్లుగా ఉద్యాన పంటల సాగు అంతంతమాత్రంగానే ఉంది. అదే గత టీడీపీ ప్రభుత్వం లాగే ఈ ఐదేళ్లలోనూ అదే ఒరవడి కొనసాగి ఉంటే ఉద్యాన పంటల సాగు ఉమ్మడి గుంటూరు జిల్లాలో లక్ష హెక్టార్ల మార్కును తాకి ఉండేది. కానీ అలాంటిదేమి జరగకపోగా ఏటికేడు సాగులో తీసికట్టు నమోదవడం గమనార్హం.

- వైసీపీ పాలనలో తిరోగమనం
- ఐదేళ్లుగా పంటల రాయితీలకు మంగళం
- కేంద్రం నిధులను దారి మళ్లించిన రాష్ట్ర ప్రభుత్వం
- బాపట్ల జిల్లా రైతులకే రూ.200 కోట్లపైగా ఎగనామం
- ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా రూ.500 కోట్లపైమాటే
- నాడు ప్రోత్సాహం.. నేడు తిరస్కారం

బాపట్ల, మే12 (ఆంధ్రజ్యోతి): సంప్రదాయ పంటల సాగుతో రైతులు నష్టపోతున్నారు. నానాటికి ఆయా పంటల సాగు కష్టంగా మారుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. లాభాలు అత్యధికంగా ఆర్జించే ఉద్యాన పంటల సాగుపై రైతులు దృష్టి పెడుతున్నారు. అయితే సంప్రదాయ పంటలసాగుతో పోలిస్తే ఉద్యాన పంటల సాగుకు పెట్టుబడి అధికం. దీంతో ప్రభుత్వాలు ప్రత్యేకంగా దృష్టి సారించి ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు రాయితీలు, విత్తనాలు అందించాలని నిర్ణయించాయి. కేంద్ర ప్రభుత్వ సహకారంతో గత టీడీపీ ప్రభుత్వం ఉద్యాన పంటల సాగును పెద్దఎత్తున ప్రోత్సహించింది. అయితే టీడీపీ పాలన పురోగమనానికి చిరునామాగా ఉంటే వైసీపీ ఐదేళ్లలో నామమాత్ర ఖర్చు కూడా ఉద్యాన పంటల సాగు ప్రోత్సాహకాల కోసం ఖర్చు పెట్టలేదు. పైగా బకాయిల చెల్లింపుల విషయంలో ఇప్పటికీ అతీగతి లేకుండా చేసింది. పైగా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను సైతం దారి మళ్లించి ఉద్యాన రైతుల నోట్లో మట్టి కొట్టిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది. మరోవైపు ఏడాదిన్నర క్రితం ఉద్యాన పంటల కోసం జిల్లాల వారీగా ప్రణాళికలు రచించామని, ఇక నిధుల కేటాయింపే తరువాయి అనే ఉపన్యాసాలు ఇచ్చి నిలువునా వంచించారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో 70 వేల మందికి లబ్ధి..

ఉద్యాన పంటలసాగుకు మేలైన విత్తనాల కోసం షేడ్‌నెట్, పాలీహౌస్ వంటివాటితో పాటు మల్చింగ్ షీట్లు కూడా అవసరం అవుతాయి. టీడీపీ హయాంలో నిమ్మ, జామ, బొప్పాయి, మామిడి తోటల విస్తరణకు క్రమం తప్పకుండా రాయితీలను అందించింది. ఎకరాకు రూ.5,000 వరకు ఈ ప్రోత్సహకాన్ని అందించేవారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం ఉండేది. ఇదేకాకుండా బిందు, తుంపర సేద్యం ప్రాజెక్టులను గ్రామాలను యూనిట్‌లుగా తీసుకుని అమలు చేసేది. ఏటా ఈ లక్ష్యాన్ని పెంచుకుంటూ దాదాపు 10,000 ఎకరాలను డ్రిప్ పరిధిలోకి తెచ్చింది. 4,000 ఎకరాల్లో మల్చింగ్ షీట్ రాయితీలను ఇచ్చింది. ఇవే కాకుండా ప్యాక్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజీలు, రాయతీలపై ఏసీ వాహనాలు ఇలా ఉద్యాన రంగ పురోగమనానికి కృషి చేసింది. టీడీపీ ప్రభుత్వ ఐదేళ్లలో వివిధ పథకాల ద్వారా ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 70,000 మంది రైతులకు లబ్ధి చేకూరింది

వైసీపీ పాలనలో తిరోగమనం..

వైసీపీహయాంలో ఉద్యానరైతులకు గడ్డు పరిస్థితులు ఎదుర్కొన్నారు. రాయితీలను ఎత్తివేయడంతోపాటు బకాయిల విషయంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించారు. ఉద్యాన పంటల సాగును తిరోగమన బాట పట్టించిన ఘనత వైసీపీ ప్రభుత్వానిది. 2019 నాటికి ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా దాదాపు 80,000 హెక్టార్ల వరకు సాగు జరిగింది. బాపట్ల జిల్లాలో ఈ పంటల సాగు 37,000 హెక్టార్ల వరకు వెళ్లింది. 2020 నుంచి వరుసగా నాలుగేళ్లు తగ్గుముఖమే తప్ప వృద్ధి లేదు. ఈ ఏడాది ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉద్యాన పంటల సాగు సగటున 50,000 హెక్టార్లలోపుకే పరిమితమైనట్లు తెలుస్తోంది. రైతుల నష్టపోయిన రాయితీల మొత్తం విలువ గడచిన ఐదేళ్లలో ఉమ్మడి గుంటూరుజిల్లా వ్యాప్తంగా రూ.500 కోట్లకు పైమాటేనని అంచనా.

బకాయిలకు లభించని మోక్షం

ఉద్యాన రైతులకు చెల్లించాల్సిన బకాయిల విషయంలో దాదాపు మూడున్నరేళ్ల నుంచి వైసీపీ ప్రభుత్వం దాగుడుమూతలు ఆడుతూ వస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే పెండింగ్ ఉన్న రాయితీ బకాయిలు రూ.50 కోట్లుకాగా, ఒక్క బాపట్ల జిల్లావరకు ఈ మొత్తం సుమారు రూ.20 కోట్లు వరకు ఉన్నట్లు సమాచారం. రాయితీలు అందించకపోగా బకాయిల విషయంలో ఏళ్ల తరబడి రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. వీటిలో 60 శాతం మేర గడచిన ఏడాది చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని బకాయిలను సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్‌తో సరిపెట్టినట్లు తెలుస్తోంది. కేంద్రం ఇచ్చే రాయితీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేయకుండా వేరే అవసరాలకు మళ్లించడంతో గడచిన ఏడాది కేంద్రం ప్రత్యేక ఖాతాలు తెరిపించి వాటిలో రాయితీ సొమ్ము జమ చేయడం వల్లే కొన్ని బకాయిలకైనా మోక్షం లభించిందనేది సమాచారం

రైతులను మోసం చేయడానికి మరో ఎత్తుగడ..

ఉద్యాన పంటల సాగును పట్టించుకోకుండా ఏళ్ల పాటు కుంభకర్ణ నిద్ర పోయిన వైసీపీ ఏడాదిన్నర క్రితం రాయితీ ప్రణాళికలంటూ సరికొత్త పల్లవిని ఎత్తుకుంది. ఇందులో భాగంగా ఒక్క బాపట్ల జిల్లాకే రూ.25కోట్లతో ఉద్యాన సాగు ప్రణాళికలంటూ ఊదరగొట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా చూస్తే ఈ ప్రణాళికల్లో కేటాయించిన వాటా రూ.60 కోట్లకు పైమాటే. ఇవి కూడా పేపర్లకే పరిమితమయ్యాయి తప్పితే ఒక్క రూపాయి నిధులు విదిల్చిన పాపాన పోలేదు.

వైసీపీ గూండాల అరాచకం

- టీడీపీ ఏజెంట్లుగా కూర్చుంటే చంపేస్తాం
- టీడీపీ నేతల గృహాలకు వెళ్లి వైసీపీ గూండాలు దాడి
- ట్రాక్టర్ ధ్వంసం



వైసీపీ గూండాల దాడిలో గాయపడిన టీడీపీ సానుభూతిపరులు

మాచర్లటౌన్, మే 12: వైసీపీ గూండాలు బరితెగించారు. ఎన్నికల రోజు ఏజెంట్‌గా కూర్చుంటే చంపేస్తాం నా.. అంటూ బెదిరింపులకు దిగారు. టీడీపీ నేతలు ఎదురు తిరగడంతో దాడికి పాల్పడ్డారు వైసీపీ గూండాలు. టీడీపీ సానుభూతిపరుల నివాసాలపై వైసీపీ నేతలు అత్యంత పాశవికంగా దాడి చేసిన ఘటన రెంటచింతలలో ఆదివారం జరిగింది. రెంటాలకు చెందిన మల్లయ్య, సిద్ధయ్యలు సోమవారం జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో రెంటాల పోలింగ్ బూత్‌ల్లో ఏజెంట్లుగా కూర్చున్నేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న వైసీపీ నేతలు మోర్తాల ఉమామహేశ్వరరెడ్డితోపాటు మరో 30 మంది వైసీపీ గూండాలు రెంటచింతలలోని వైఆర్‌ఎస్ హైస్కూల్ సమీపంలో నివాసముంటున్న టీడీపీ నేతలు మల్లయ్య, సిద్ధయ్యల గృహాలకు వెళ్లారు. ఆ సమయంలో సిద్ధయ్య, మల్లయ్యలు భోజనం చేస్తుండగా కంచం లాగేసి ఛాతి భాగాన ఎగిరి తన్నారు. అంతటితో ఆగకుండా విచక్షణా రహితంగా రాడ్లు, కర్రలతో దాడి చేసి గాయపరిచారు. మహిళలపై దుర్భాషలాడారు. ట్రాక్టర్‌ను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో టీడీపీ నాయకులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం తెలుసుకున్న టీడీపీ సానుభూతిపరులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని వైసీపీ నేతలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. కారంపూడి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నారాయణస్వామి సకాలంలో అక్కడకు చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. పోలీసులు సకాలంలో రాకుంటే ప్రాణాలు పోయేవని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. పోలీసులు వచ్చి వైసీపీ గూండాలు నుంచి కాపాడారన్నారు. జరిగిన దాడిపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వైసీపీ దాడులకు బయపడేది లేదు ... బ్రహ్మారెడ్డి

వైసీపీ దాడులకు భయపడేది లేదని, తమ కార్యకర్తలను కాపాడుకుంటామని, వారికి అండగా ఉంటామని, ఎవరూ భయపడాల్సిన పనిలేదని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి బాధితులకు భరోసానిచ్చారు. ఆదివారం జరిగిన సంఘటనపై రెంటచింతల పోలీస్‌స్టేషన్ వద్ద సీఐ నారాయణస్వామికి బ్రహ్మారెడ్డి వివరించారు. పార్టీలకు అతీతంగా వ్యవహరించాలని, సమన్యాయం అందరికీ వర్తించేలా చూడాలని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి టీడీపీ నేతలపై దాడుల పరంపర కొనసాగుతోందని, దీనికి అంతం లేదా అని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ నేత సిద్ధయ్యపై వైసీపీ నేతలు దాడి చేసి ట్రాక్టర్‌ను ధ్వంసం చేయడం, అన్నం తింటుండగా కంచం లాగడం అరాచకమన్నారు. పోలింగ్ ముందు రోజు తమ పార్టీ ఏజెంట్లను భయభ్రాంతులకు గురిచేయడం, దాడులు చేయడం అనాగరిక చర్య అన్నారు. పరిస్థితి ఇప్పుడే ఇలా ఉంటే పోలింగ్ రోజున అధికారపార్టీ అరాచకాలను ఊహించడం కష్టంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా దౌర్జన్యాలు, హింస మార్గాలకు స్వస్తి పలికి ఎవరి ఓటు వారు వేసుకునేలా వ్యవహరించాలని, అందుకు పోలీసులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బాధితులను పరామర్శించి ఎల్లప్పుడూ అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. టీడీపీ బడుగు, బలహీనుల పార్టీ అని అన్నారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు చప్పారపు అబ్బిరెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, రామకృష్ణ, శౌరైడ్డి, కాయితి రవికృష్ణారెడ్డి, బాలయ్య, ఆదూరి శివ, ముని నాయక్ ఉన్నారు.



వైసీపీ నేతల దాడిలో ధ్వంసమైన ట్రాక్టర్

ఏజెంట్లుగా నిలబడతారా... అంతు చూస్తాం

- కాకిరాలలో వైసీపీ గూండాల వీరంగం

దుర్గి : ఏజెంట్లుగా నిలబడతారా.. మీ అంతు చూస్తాం అంటూ వైసీపీ గూండాలు వీరంగం సృష్టించి దాడులకు తెగబడ్డారు. ఈ దాడుల్లో ఇరువురు టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయి. మండలంలోని కాకిరాలలో ఆదివారం మించాలపాడుకు చెందిన సింగంశెట్టి నాగమధు, మిర్యాల సైదులు అనే టీడీపీ కార్యకర్తలు ఏజెంట్లుగా ఉండేందుకు ఫారంలు పూర్తి చేస్తున్నారు. ఈ సమయంలో సుమారు 15 మంది వైసీపీ గూండాలు కర్రలతో పోలింగ్ బూత్‌వద్దకు వచ్చి ఏజెంట్లకు నిలబడేటంత మొనగాళ్లారా మీరు.. చంపేస్తాం.. అంటూ దాడులు చేశారు. ఈదాడిలో టీడీపీ కార్యకర్తలు సింగంశెట్టి నాగమధు తలకు గాయం కాగా, మిర్యాల సైదులు చేతికి గాయమైంది. దాడి జరిగే సమయంలో పోలీసు కానిస్టేబుల్ ఒకరు మాత్రమే ఉన్నారని, గొడవ జరుగుతున్నప్పటికీ అతను కూడా పక్కకు వెళ్లిపోయాడని గ్రామస్తులు చెబుతున్నారు. వైసీపీకి చెందిన బొజ్జా వెంకటనారాయణ, మూఢావత్ శ్రీను, కనకరాజు వెంకయ్య, రాజేష్, పోట్లూరి లక్ష్మయ్య, నాగయ్య, మంగమ్మ, పసుపులేటి వెంకటేశ్వర్లు, చిన్ని, బూదాని అంజి, కొంగా నాగేశ్వరరావు, ఉడతల జగన్‌తోపాటు మరికొందరు తమపై దాడిచేసినట్లు బాధితులు తెలిపారు. ఫిర్యాదు చేసేందుకు బాధితులు దుర్గి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

భట్టిప్రోలు, మే 12: ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని చింతమోటు గ్రామం వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కాసుల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెదలంక కాకులడొంక నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి మండలంలోని చింతమోటు గ్రామం వద్ద బోల్తా కొట్టింది. ఈ ఘటనలో పెదలంక గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దున్నా శ్రీధర్ (27) ట్రాక్టర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.



గల్లా జయదేవ్‌తో మాట్లాడుతున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

పెమ్మసాని చంద్రశేఖర్‌తో

ఎంపీ గల్లా జయదేవ్ భేటీ

గుంటూరు, మే12(ఆంధ్రజ్యోతి): గుంటూరు సిట్టింగ్ ఎంపీ గల్లా జయదేవ్ సోమవారం తన ఓటు హక్కుని వినియోగించుకు నేందుకు ఆదివారం సాయంత్రం గుంటూరుకు చేరుకున్నారు. ఆయన పశ్చిమ నియోజకవర్గంలో తన ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఎంపీ గల్లా జయదేవ్ వచ్చిన విషయం తెలుసుకున్న గుంటూరు పార్లమెంట్ టీడీపీ కూటమి అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఎంపీ గల్లా జయదేవ్‌ను విందుకు ఆహ్వానించారు. ఈమేరకు ఆదివారం రాత్రి ఎంపీ గల్లా జయదేవ్ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నివాస గృహానికి చేరుకొని ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ గల్లాను పెమ్మసాని చంద్రశేఖర్ దుశ్శాలువా, బొకేతో ఘనంగా సత్కరించారు.

అదనపు బోగీ ఇచ్చారు..

పీఆర్‌ఎస్‌లో చూపలేదు

- సికింద్రాబాద్ - రేపల్లె ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణీకుల ఇక్కట్లు

గుంటూరు,మే12 (ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్ -రేపల్లె ఎక్స్‌ప్రెస్‌కి అదనపు స్లీపర్ క్లాస్(ఎస్‌ఈ1) బోగీని జత చేసి దానికి సంబంధించి పీఆర్‌ఎస్‌లో ఎనేబుల్ చేయడాన్ని రైల్వేశాఖ మరిచింది. దాంతో ఆదివారం వెయిటింగ్ లిస్టులో ఉన్న ప్రయాణీకుల్లో ఏ ఒక్కరికి కూడా టిక్కెట్‌లు కన్‌ఫర్మ్ కాలేదు. ఈకారణంగా ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడి జిల్లాకు చేరుకొన్నారు. సాధారణంగా వెయిటింగ్ లిస్టులు చాంతాడంత ఉంటే అదనపు బోగీలను ఏర్పాటు చేసి కొంతమేరకు వాటిని క్లియర్‌చేస్తారు. ఆవిధంగా రేపల్లె ఎక్స్‌ప్రెస్‌కి ఆదివారం వెయిటింగ్ లిస్టులో 300లకు పైగా టిక్కెట్‌లు బుక్ అయ్యాయి. వీరంతా హైదరాబాద్‌లో నివసిస్తూ ఓటు వేసేందుకు స్వస్థలాలకు బయలుదేరిన వారే. అదే ఎస్‌ఈ-1 బోగీని పీఆర్‌ఎస్‌లో ఎనేబుల్ చేసి ఉంటే కనీసం 70మందికి పైగా బెర్తులు కన్‌ఫర్మ్ అయ్యేవి. అలానే మరి కొంత మందికి కనీసం కూర్చోవడానికి ఆర్‌ఏసీ సీట్లు వచ్చేవి. రైల్వే శాఖ చేసిన తప్పిదం కారణంగా ఎస్‌ఈ-1 బోగీలో ఎవరు పడితే వారు ఎక్కారు. ప్రయాణీకుల మధ్యన గొడవలు కూడా జరిగాయి.



గుంటూరులో ఓ అన్నా క్యాంటిన్ దుస్థితి ..



పిచ్చి మొక్కల మధ్య నరసరావుపేట స్టేడియం వద్ద అన్న క్యాంటీన్

పేదల కడుపు కొట్టారు

- వైసీపీ కుట్రతో అన్న క్యాంటీన్ల మూత
- ఐదేళ్ల క్రితం ఆకలి తీర్చిన భోజనాలయాలు
- పేరు, రంగులు మార్చి పాడు పెట్టిన జగన్

(గుంటూరు,నరసారవుపేట/ఆంధ్రజ్యోతి, తెనాలి అర్బన్)

అన్న క్యాంటీన్లు.. నాడు పేదల ఆకలి తీర్చే భోజనాలయాలు. నేడు చెత్తాచెదారాలతో నిండి శిథిలావస్థకు చేరి అసాంఘీక కార్యకలాపా లకు నిలయాలు. అన్నార్తులకోసం చంద్రబాబు ముఖ్య మంత్రిగా అతి తక్కువ ధరకు, నాణ్యమైన ఆహారాన్ని అందిం చేందుకు మున్సిపల్ కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశారు. నిత్యం పేదలు, దినసరి కూలీలు, ఉపాధి నిమిత్తం ఇతర ప్రాంతాల నుంచి పట్టణాలకు వచ్చే వారి ఆకలి తీర్చేలే ఈ అన్నక్యాంటీన్లను రూపొం దించారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారం లోకి వచ్చీరాగానే జగన్ సీఎం పీఠం ఎక్కు తూనే వాటికి మరణశాసనాన్ని లిఖించారు. తొలుత పార్టీ రంగులు అద్దించారు.. ఆపై పేరు మార్చారు.. అయినా వీటిని కొనసాగిస్తారని ఆశించిన పేదలకు 58 నెలలుగా నిరాశే ఎదు రైంది. అన్న క్యాంటీన్ల ఉనికే లేకుండా చేసేశారు. కరోనా సమయంలో జగన్ మనస్సు కరిగి రాజన్న క్యాంటీన్ల (అన్న క్యాంటీన్ల)ను కొనసాగి స్తారని అందరూ ఆశించారు. అయితే ప్రభుత్వం ఆ దిశగానే ఆలోచన చేయలేదు. తమిళనాడులో అమ్మ క్యాంటీన్ల స్ఫూర్తితో చంద్రబాబు రాష్ట్రంలో అన్న క్యాంటీన్ల పేరుతో అదే విధానాన్ని అమల్లోకి తీసుకురాగా సీఎం జగన్ వాటిని పాడుబెట్టేశారు. నిత్యంసూర్యోదయాన రుచికరమైన ఫలహారాన్ని, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని రూ.5 చొప్పున వడ్డించేవారు. కూలినాలి చేసుకునేవారు భోజనానికి ఇబ్బంది లేదన్న భరోసా అన్న క్యాంటీన్లతో ఏర్పడింది. పేదల ఆకలి తీర్చేందుకు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉన్న ఈ కేంద్రాలు పేదల భోజన ఆలయాలుగా విలసిల్లాయి. వీటితో చంద్రబాబుకి మంచిపేరు రావడం జీర్ణించుకోలేకనే జగన్ మూతేయిం చారని పలువురు విమర్శించినా వైసీపీ పాలకులు పట్టించుకోలేదు.



అన్న క్యాంటీన్‌లో ఆహార పట్టిక

పక్క రాష్ట్రాల్లో కొనసాగింపు.

తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ప్రభుత్వాలు మారినా అక్కడ అధికారంలోకి వచ్చిన వారు విధానాలను మార్చలేదు. పేదల ఆకలి తీర్చే భోజన ఆలయాలను యధాతథంగా కొనసాగిం చారు. అయితే ఇక్కడ అంతా రివర్స్‌గా వ్యవహరించిన వైసీపీ నేతలు పేదల కడుపుపైనా కొట్టారు. పేదలకు మూడు పూటలా ఆహారాన్ని అందిస్తూ సర్వత్రా ఆదరణపొందిన అన్న క్యాంటీన్లతో చంద్రబాబుకు పేరు వస్తుందని తొలుత రంగులు మార్చారు, అతర్వాత తండి పేరు పెట్టుకు న్నారు. అయినా కక్ష తీరని ప్రభుత్వం ఏకంగా వాటిని పాడుపెట్టేసింది. ప్రస్తుతం ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధి లోని అన్నక్యాంటీన్ల భవనాల నిర్వహణను సంబంధిత అధికారులు గాలికొదిలేశారు. దీంతో ఆయాభవనాల్లో వ్యర్థాలు పెరుకుపోయాయి. కొన్ని దగ్గర్ల అసాంఘీక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయి. ఆకలి తీర్చిన భవనాలు శిథిలా వస్థకు చేరుకోవడంతో పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరు నగరంలోని మిర్చియార్డు, చుట్టుగుంట, నల్లచెరువు, అమరావతిరోడ్డు, పల్నాడు బస్టాండ్, నందివెలుగురోడ్డులో, తెనాలిలో మార్కెట్ సెంటర్, బస్‌స్టేషన్, మార్కెట్ యార్డు, నరసరావుపేట సేడియం వద్ద ఉన్న ఈ భవనాలు ప్రస్తుతం కనిపించనంతగా పిచ్చి మొక్కలతో నిండిపోయాయి.



నరసరావుపేటలో అధ్వాన్నంగా మార్కెట్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్



తెనాలి బస్ స్టేషన్ వద్ద ఉన్న అన్న క్యాంటీన్

మూడు ముక్కలాటతో

రాష్ట్ర పరువు గంగపాలు

- 1608వ రోజుకు రైతుల నిరసనలు, ఆందోళనలు

తుళ్లూరు, మే 12: ఒక్క ఛాన్స్ ఇవ్వండి పరిపాలన ఎంతో ఉన్నతంగా చేసి చూపిస్తానని చెప్పిన సీఎం జగన్‌రెడ్డి.. ఈ ఐదేళ్లలో ఎక్కడ అభివృద్ధి అనేది లేకుండా చేశారని రాజధానికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద ఉండి మహిళలు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు ఆదివారం నాటికి 1608వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, జగన్‌రెడ్డికి రెండవ ఛాన్స్ ఇస్తే ఆంధ్రుల మనుగడే ఉండదన్నారు. వైసీపీకి ఓటు వేస్తే అరాచక శక్తులు రాజ్యమేలుతాయని స్పష్టం చేశారు. మూడు ముక్కల ఆటతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారన్నారన్నారు. వార్షిక కౌలు ఇవ్వకుండా రైతులను పస్తులు పెడుతున్నారన్నారు. రాజధాని కోసం జీవనాధారమైన భూమిలిస్తే నరకం చూపిస్తున్నారని ఆవేద వ్యక్తం చేశారు. సీఎం జగన్‌రెడ్డి పరిపాలన చేసిన ఈ ఐదేళ్లలలో రాష్ట్రానికి ఏ ఒక్క పరిశ్రమ వచ్చిన దాఖలాలు లేవన్నారు. నిరుద్యోగ యువత పెరిగిపోయిందన్నారు. అమరావతి అభివృద్ధి కొనసాగితే లక్షల ఉద్యోగాలు వచ్చేవన్నారు. మూడు రాజధానులు ప్రతిపాదన జగన్‌రెడ్డికి సొంత ప్రయోజనం కోసమేనన్నారు. అభివృద్ధి చేసే నాయకుడికి ఓటు వేయాలని విన్నవించారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో రైతుల నిరసనలు, ఆందోళనలు కొనసాగాయి.



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.40
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	155, 164,175
చికెన్ విత్ స్కిన్	300.00
చికెన్ స్కిన్ లెస్	310.00



పందెమా... నై.. నై

- ఓటమి భయంతో డీలా పడ్డ వైసీపీ

ప్రత్తిపాడు, మే 12: ఎన్నికల సమయం వచ్చిందంటే కాయ్ రాజా కాయ్ అంటూ కాలుదువ్వే వైసీపీ నాయకులు, సానుభూతి పరులు ఇప్పుడు చప్పగా కూర్చున్నారు. గ్రూపులుగా ఏర్పడి కోట్ల రూపాయల్లో జరిగే బెట్టింగులకు వైసీపీ ఆమడ దూరంలో ఉంటుంది. అర్థ రూపాయికి రూపాయి పందెం అన్నా సరే.. నై.. నై అంటూ తల కూడా తిప్పకుండా తప్పించుకు పోతున్నారు. ఇటు ప్రత్తిపాడు నియోజకర్గంతో పాటు రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు విషయంలో కూడా ఎవరూ ధైర్యంగా ముందుకు రావడం లేదు. వైసీపీ నాయకులు సైతం సైలెంట్‌గా తెలుగుదేశం పార్టీ గెలుస్తుందని పందానికి సిద్ధం అవుతున్నారు తప్ప వైసీపీ గెలుస్తుందని ఎవరూ ముందుకు రాని పరిస్థితి.

ప్రత్తిపాడు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ వైపు గాలి బలంగా వీస్తుంది. గెలుపు తథ్యం అని ఇప్పటికే మారిన సమీకరణాలు బలంగా చూపుతున్నాయి. తెలుగుదేశం పార్టీ, జనసేన కలిసి రంగంలోనికి దిగటంతో ప్రత్తిపాడు నియోజకవర్గంలో సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ క్రమలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి రామాంజనేయులు గెలుపు సునాయాసం కావడంతో పాటు అందరి దృష్టి మెజారిటీపై పడింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి తెలుగుదేశం పార్టీకి భారీ మెజారిటీ వస్తుందని అందరూ భావిస్తున్నారు. అందుకు కారణం నియోజకవర్గంలో వైసీపీ నుంచి వేల సంఖ్యలో కుటుంబాలు తెలుగుదేశం పార్టీ లోకి చేరడమే కారణంతో పాటు గుంటూరు రూరల్‌లో తెలుగుదేశం పార్టీ ఊపు ఎక్కువగా కనిపిస్తుంది. జనసేన కలయిక ప్రత్తిపాడులో తమ పార్టీకి గండి పడుతుందని వైసీపీ కి బాగా తెలుసు. జనసేన కార్యకర్తలు ఈ సారి గట్టి పట్టుతో ఉండటంతో ఎన్ని పన్నాగాలు పన్నినా ఆ గ్రామాలలో వైసీపీ అడుగు కూడా పెట్టలేక పోయింది. ఈ పరిస్థితుల్లో ఓటమి తప్పదని బావించిన వైసీపీ కార్యకర్తలు పందానికి వెనకడుగు వేస్తున్నారు. 15వేలు పైన మెజారిటీకి పందెంకు కూడా జంకుతున్నారు. ఇక రాష్ట్రంలో అధికారంలోనికి తెలుగుదేశం పార్టీ వస్తుందని జరిగే పందాలకు కూడా వైసీపీ నాయకులు ముందుకు రావడం లేదు. ఎవరికి కూడా రాష్ట్రంలో వైసీపీ అధికారంలోనికి వస్తుందనే నమ్మకం వారికి కలగటం లేదు. దీంతో పందెం అంటే నై.. నై అంటూ పరుగులు పెట్టే పరిస్థితి వైసీపీలో నెలకొంది.



ఏఎన్‌యూలోని రిసెప్షన్ సెంటర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్



మంగళగిరిలోని పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

నిరంతర.. పర్యవేక్షణ

గుంటూరు, మే 12(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి పోలింగ్ సామాగ్రి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించారు. ఆదివారం ఆయన జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, రిటర్నింగ్ అధికారులతో కలిసి ఆయా సెంటర్లను సందర్శించడంతో పాటు మంగళగిరిలో పోలింగ్ కేంద్రాలకు వెళ్లి అక్కడ ప్రజలు ఓట్లు వేసేందుకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం పోలింగ్ సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. కలెక్టర్ తొలుత గుంటూరు నగరంలోని టీజేపీఎస్ కళాశాల, ఏఎల్ బీఈడీ కాలేజ్, ఏసీ కాలేజ్, జేకేసీ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు వెళ్లారు. అక్కడ ఈవీఎంల, ఇతర పోలీసు సామాగ్రిని ఏ విధంగా సిబ్బందికి పంపిణీ చేస్తున్నారనేది ఆర్వోలను అడిగి తెలుసుకొన్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ సామాగ్రిని పంపిణీ చేసింది, లేనిది తనిఖీ చేశారు. సాయంత్రం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌ని సందర్శించారు. ఆ తర్వాత మంగళగిరిలో ఒక పోలింగ్ కేంద్రానికి వెళ్లి జాయింట్ కలెక్టర్ రాజకుమారితో కలిసి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల నుంచి యూనివర్శిటీకి వచ్చే వాహనాలు, తిరిగి వెళ్లే వాటితో ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. రిసెప్షన్ సెంటర్ల వద్ద ఈవీఎంల స్వీకారం, వాటిని సంబంధిత స్ట్రాంగ్‌రూంలకు తరలించే మార్గాల్లో పటిష్టమైన బ్యారికేడింగ్ చేయాలన్నారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్‌డీవో శ్రీకర్, తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్ జైన్, పశ్చిమ ఆర్వో రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రిజర్వు సిబ్బంది రోడ్డున..

- ఉదయం నుంచి రాత్రి 8 గంటల వరకు పడిగాపులు
- ఏసీ కళాశాలలో ఆర్వో నిర్వాకంపై తీవ్రస్థాయిలో విమర్శలు

గుంటూరు(విద్య), మే 12: ఎన్నిక విధుల్లో పాల్గొనే రిజర్వు సిబ్బందికి అక్కడ అధికారులు చుక్కలు చూపించారు.. ఉదయం నుంచి సాయంత్రం 8 గంటల వరకు నిరీక్షించినా వారికి విధులు కేటాయించక పోగా కనీసం మౌలిక వసతులు కల్పించాలన్న స్పృహ కూడా లేకుండా వ్యవహరించారు. స్థానిక ఏసీ కళాశాలలోని ఏర్పాటు చేసిన ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రానికి ఆదివారం గుంటూరు నగరంతోపాటు జిల్లాలో బాపట్ల, పొన్నూరు, తాడికొండ తదితర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో రిజర్వు సిబ్బందిని రప్పించారు. టీచర్లతోపాటు అంగన్‌వాడీ టీచర్లు, ఇతర శాఖల సిబ్బంది ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో అరకొరగా భోజనం పెట్టి వారి పట్టించుకోవడం మరిచిపోయారు. దాదాపు 400 మందికిపైగా ఉన్న రిజర్వు సిబ్బంది సాయంత్రం వరకు కనీసం మంచినీరు కూడా లేకుండా కేంద్రంలో ఎదురు చూడాల్సి వచ్చింది. అనేక కేంద్రాల్లో సాయంత్రం 5 గంటలకే రిజర్వు సిబ్బందిని ఇంటికి పంపి మరుసటి రోజు అవసరాన్ని బట్టి విధులు కేటాయిస్తాని చెప్పారు. అయితే ఏసీ కళాశాలలో మాత్రం రాత్రి 8 గంటలైనా సిబ్బంది డ్యూటీలు కేటాయించ లేదు. భోజనం కాదుకదా కనీసం తాగడానికి నీరుకూడా లేక మహిళా సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తీరా రాత్రి 8.30 వచ్చిన ఎన్నికల అధికారులు మీరు ఇప్పుడు ఇంటివెళ్ళి మరలా ఉదయం 6 గంటల కల్లా రావాలని హుకుం జారీ చేశారని సిబ్బంది వాపోయారు. దూర ప్రాంతాల నుంచి ఎలా రావాలంటూ సిబ్బంది ప్రశ్నించగా మీరు టీఏ, డీఏలు తీసుకుంటున్నారు కదా ఉదయం కల్లా విధుల్లో ఉండాలని, లేకుంటే ఇక్కడే ఉండాలని స్పష్టం చేశారు. అప్పటికే సాయంత్రం 7.30 అయిందని ఇళ్ళకు వెళ్ళాలంటే ఇబ్బందులని అధికారుల దృష్టికి తీసుకువచ్చినా ఫలితం లేదని వాపోయారు. ఏసీ కళాశాలలోని కేంద్రంలో స్నానానికి ఏర్పాట్లు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు కూడా లేవని సిబ్బంది వాపోయారు. కనీసం భోజనం లేదా టిఫిన్ కూడా పెట్టకుండా రాత్రి మొత్తం ఇక్కడ ఉండాలంటే ఎలా అంటూ ప్రశ్నించినా అధికారుల నుంచిసమాధానం రాలేదు. దీంతో సిబ్బంది తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేశారు.



ఏసీ కళాశాలలో ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రం

తీరం.. రాజకీయ చైతన్యం

- సార్వత్రిక ఎన్నికల్లో రేపల్లె వాసులు ఏడుగురు అభ్యర్థులు
- రాజకీయాల్లో రాణింపు



అనగాని సత్యప్రసాద్



మోపిదేవి శ్రీనివాసరావు



డాక్టర్ ఈవూరి గణేష్



తెనాలి శ్రావణ్‌కుమార్



అంబటి రాంబాబు



అంబటి మురళీకృష్ణ



బూరగ సుబ్బారావు

రేపల్లె, మే 12: రాజకీయ చైతన్యం కలిగిన తీరప్రాంతం రేపల్లె. ఎంతోమంది నాయకులను తీర్చి దిద్ది రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించింది. ఉమ్మడి రాష్ట్రంలో రేపల్లె, కూచినపూడి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మంత్రులుగా ఎమ్మెల్సీలుగా, ఎంపీగా రాణించారు. డిలిమిటేషన్ తరువాత కూచినపూడి నియోజకవర్గాన్ని రేపల్లె నియోజకవర్గంలో కలిపారు.

ప్రస్తుతం రేపల్లె ప్రాంతానికి చెందిన ఏడుగురు అభ్యర్థులు ఎన్నికల పోటీల్లో నిలబడ్డారు. నియోజకవర్గంలోని రేపల్లెకు చెందిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అనగాని సత్యప్రసాద్ పోటీ చేస్తున్నారు. ఈయన మూడుసార్లు రేపల్లె నియోకజవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చెయ్యగా ఒక్కసారి ఓటమి చవి చూచి 2014, 2019ల్లో టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. నాలుగోసారి ఎమ్మెల్యే అభ్యర్థిగా టీడీపీ పోటీ అభ్యర్థిగా నిలిచారు. రేపల్లె మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన తెనాలి శ్రావణ్‌కుమార్ విద్యాభ్యాసం రేపల్లెలోనే జరిగింది. ఉద్యోగ విధులు రాణిస్తూ టీడీపీ అభ్యర్థిగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తాడికొండలో పోటీ చేసి 2014లో గెలుపొందగా, 2019లో ఓటమి చెందారు. ప్రస్తుతం తాడికొండ టీడీపీ అభ్యర్థిగా నిలబడ్డారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లికి చెందిన డాక్టర్ ఈవూరి గణేష్ తల్లిదండ్రులు ఎమ్మెల్యే, మంత్రులుగా విధులు నిర్వహించారు. కుమారుడు ఈవూరి గణేష్ వైసీపీ అభ్యర్థిగా ఎన్నికల్లోపోటీ చేస్తున్నారు. రేపల్లె పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది అంబటి ఆంజనేయులు కుమారుడు అంబటి రాంబాబు రేపల్లె ఎమ్మెల్యేగా చేశారు. తరువాయి పర్యాయం ఓడిపోవటంతో గుంటూరులో నివాసం ఉన్నారు. 2014లో సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిని చవి చూశారు. 2019లో వైసీపీ తరుపు నుంచి ఎమ్మెల్యేగా గెలిచి మంత్రి అయ్యారు. 2024లో సత్తెనపల్లి వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. అంబటి మురళి విద్యాభ్యాసం మొత్తం రేపల్లెలో జరిగిన వృత్తిరీత్యా కాంట్రాక్టర్‌గా విదులు నిర్వహించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో పొన్నూరు నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీలో ఉన్నారు. రేపల్లె పట్టణానికి చెందిన మోపిదేవి శ్రీనివాసరావు కాంగ్రెస్‌పార్టీ తరుపున 2014, 2019లో రెండుసార్లు పోటీలో నిలబడి ఓటమి పాలయ్యారు. 2024లో కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చెయ్యనున్నారు. రేపల్లె పట్టణానికి చెందిన బూరగ సుబ్బారావు రేపల్లె ఆర్టీసీ డిపోలో విధులు నిర్వహించారు. 2024లో వేమూరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేయుచున్నారు.రేపల్లె ప్రాంతానికి చెందిన ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులుగా ఉమ్మడి జిల్లాలో పోటీ చేస్తుండటం ప్రాంత ప్రాధాన్యం సంతరించుకుంది.

అధికారంలోకి వచ్చాక

ఇంటివద్దకే రూ. 4 వేల పింఛన్

- గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు



యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, మే 12: రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తేనే అభివృద్ధి జరుగుతుందని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారంలోకి రాగానే జూన్ నుంచే వృద్ధులకు రూ. 4వేల పింఛన్‌ను ఇంటికి వచ్చి అందజే సేలా చూస్తానని చంద్రబాబు హామీ ఇచ్చిన విషయాన్ని గమనించాలని కోరారు. అన్నివర్గా లకు సంక్షేమ పథకాలు అందజేయడంతో పాటు రైతులకు మేలుచేసే పథకాలను అమలుచేయటం టీడీపీకే సాధ్యమవుతుం దన్నారు. మేనిఫెస్టోలో ప్రకటించినట్లుగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తల్లికి వందనం, అన్నదాత, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీతో పాటు గురజాల నియోజకవర్గంలో ప్రతి ఇంటికి తాను ఒక గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. గురజాల నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని యరపతినేని కోరారు.

పెదకూరపాడు నియోజక వర్గాన్ని

అన్నివిధాలా అభివృద్ధి చేస్తా

- పెదకూరపాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్



భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, మే 12 : తాను శాసన సభ్యునిగా గెలుపొందిన తర్వాత పెదకూరపాడు నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని పెదకూర పాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యం ప్రవీణ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రసిద్ధ పుణ్య క్షేత్రమైన అమరావతి, మ్యూజియం వచ్చే భక్తులు, సందర్శకుల కోసం వసతులు కల్పిస్తాం. నియోజకవర్గంలో ప్రధానంగా రైతుల పొలాలకు సాగు నీరు అందించటం, తాగు నీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని వివరించారు. అధ్వానంగా రోడ్లను అభివృద్ధి చేయటంతో పాటు గ్రామాల్లో ఉన్న అంతర్గత రోడ్లను కూడా అభివృద్ధి పరిచి డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా ఉండేలా చూస్తాను. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తామని, గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహిం చేందుకు కృషి చేస్తానని, సదరు క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేలా ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. ముఖ్యంగా అమరావతిని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. నియోజక వర్గంలో కృష్ణా నది సాగు నీరు తాగించే రైతులకు వెన్ను దన్నుగా ఉండేం దుకు, ప్రజల దాహార్తి తీర్చేందుకు కృషి లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని భాష్యం ప్రవీణ్ తెలిపారు.

ప్రముఖుల ఓట్లు మంగళగిరిలోనే...

మంగళగిరి, మే 12: జాతీయ, రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రధాన రాజకీయ పార్టీల అగ్రనేతలు మంగళగిరిలోనే ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. సార్వత్రిక ఎన్నికల పోలింగ్ వేళ పలువురు ప్రముఖులు మంగళగిరిలో ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అందులో భాగంగా మంగళగిరి శ్రీ లక్ష్మీనృసింహస్వామి కాలనీలో ఉదయం 7 గంటలకు జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అలాగే, తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, కుటుంబ సభ్యులు కూడా ఓటు వేయనున్నారు. దీంతో మంగళగిరి నియోజకవర్గం ప్రాధాన్యతను సంతరించుకుంది.

స్వగ్రామంలో తొలిసారి ఓటు వేయనున్న

రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ డాక్టర్ నిమ్మగడ్డ



రాష్ట్రఎన్నికల మాజీ కమిషనర్ డాక్టర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్

దుగ్గిరాల, మే 12: రాష్ట్ర ఎన్నికల సంఘం మాజీ కమిషనర్ డాక్టర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ సోమవారం స్వగ్రామంలో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాలకు చెందిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి స్వగ్రామంలో ఓటుహక్కు కోసం కోర్టును ఆశ్రయించారు. తన ప్రాథమిక విద్యనభ్యసిం చడంతోపాటు ఆస్తిపాస్తులన్నీ దుగ్గిరాలలోనే అంటూ ఏడాది పోరాటానంతరం ఆధారాలను కోర్టుకు సమర్పించి, అధికారుల కళ్లు తెరిపించి, ఓటుహక్కు సాధించుకోవడం తెలిసిందే. స్థానిక తహసీల్దార్ అప్పట్లో స్థానికతపై అభ్యంతరం వ్యక్తం చేసి, ఓటు స్వగ్రామంలో కల్పించేందుకు నిరాకరించిన నేపథ్యంలో కోర్టు ద్వారా సాధించుకుని ఓటుహక్కు కోల్పోయిన వారిలో ధైర్యాన్ని నింపారు. తన బాటలో వారు కూడా ఓటుహక్కు పొందేందుకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ నేపథ్యంలో తాను జన్మించిన గ్రామంలో తొలిసారి ఓటువేయనున్నారు.

మా రోజుల్లో ఓటుపై అవగాహన లేదు

- రాను రాను ఓటు విలువ దిగజారుతోంది
- శతాధిక వృద్ధుడు సుబ్బారావు



మొవ్వ సుబ్బారావు

వేమూరు, మే 12: బ్రిటీష్ వారి కాలంలో ఓటు విలువ ప్రజలకు అంతగా తెలిసేది కాదని, ఓటు విలువ తెలిసిన కొద్దీ రాను రాను దాన్ని విలువ కూడా దిగజారుతోందని వేమూరుకు చెందిన శతాధిక వృద్ధ రైతు మువ్వ సుబ్బారావు ఆవేదన వ్యక్తపరిచారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 1924లో తాను జన్మించానని, 1942వ సంవత్సరంలో తొలి ఓటు వేయడం జరిగిందన్నారు. ఆ కాలంలో ఇంత విస్తృతంగా ప్రచారం ఉండేది కాదని, ఒక పెద్దమనిషి చెప్పిన మాట ప్రకారం ఓటు వేసే వారని తెలిపారు. తనకు 25 సంవత్సరాల వయస్సు వచ్చినప్పుడు ప్రతి ఒక్కరూ కాంగ్రెస్ పార్టీకే మొగ్గు చూపేవారని, అయితే బ్రిటీష్ వారి పాలనలో రైతును గౌరవించారని, వ్యవసాయాన్ని ప్రోత్సహించారని అన్నారు. ఆ విధానంలో ఈ రోజున ఏ ప్రభుత్వం రైతుకు సరైన న్యాయం చేయడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. స్వాతంత్ర్య సమరయోధులు వెన్నం కోటయ్య, ఉయ్యూరు వెంకట్రామయ్యలాంటి పెద్దలు కొన్ని ఉద్యమాలు చేపట్టారని ఆ సందర్భాలలో కావూరు ఆశ్రమానికి వచ్చిన మహాత్మగాంధీని గుంటూరుకు వచ్చిన జవహర్‌లాల్ నెహ్రూను రైతుల పక్షాన తాను కలవడం జరిగిందన్నారు. రాజకీయ దురంధరుడు అయిన ఆలపాటి వెంకటరామయ్య లాంటి నాయకులు ఈ రోజున సమాజంలో లేరని అన్నారు. ఎన్నికల సమయంలో ఈ రోజున ఓటును డబ్బుకు అమ్ముకోవడం జరుగుతోందని, పూర్వకాలంలో ప్రతి ఓటరు డబ్బుకు ఆశపడకుండా మాటకు కట్టుబడి ఉండేవారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం మార్పు అవసరమని తన అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. ప్రధానిగా పనిచేసిన వాజ్‌పేయిని ఢిల్లీలో కలవడం జరిగిందని అలాంటి సిద్ధాంతాలకు లోబడి పనిచేసిన మంచి నాయకులు ఈ రోజున కరువయ్యారని అన్నారు. ఏదిఏమైనా ప్రస్తుత పరిస్థితుల్లో పాలకుల మార్పు అవసరమని అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు: ఎస్పీ వకుల్

బాపట్ల, మే 12 : జిల్లాలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను పరిశీలించేందుకు కమాండ్ కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మొబైల్‌యాప్ ద్వారా ఈవీఎం బాక్స్‌లకు, పోలింగ్‌సిబ్బందికి రూట్ మొబైల్ పార్టీలు ఎస్కార్ట్ నిర్వహిస్తూ పోలింగ్ కేంద్రాలకు చేర్చే విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమర్ద్ మొబైల్ యాప్ ద్వారా జిల్లాలో జరుగుతున్న ఎన్నిక ప్రక్రియను కమాండ్ కంట్రోల్‌రూమ్‌లో పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్ ప్రెస్ చేస్తే పోలీసు అధికారులు ఆప్రదేశానికి చేరుకోవటానికి ఎంత సమయం పడుతుందనే విషయంపై ప్రత్యేకంగా డెమో వీక్షించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎక్కడైన శాంతిభద్రతలకు విఘాతం కలిగిన, గొడవలు జరుగుతున్న ఆ ప్రదేశానికి పోలీసులు, కేంద్ర సాయుధ బలాలు వెంటనే చేరుకునేందుకు జిల్లాలోని పోలింగ్ కేంద్రాలలో సమస్యాత్మక, సాధారణ పోలింగ్ కేంద్రాలను సులువుగా గుర్తించేందుకు ఏ పోలీసు అధికారి ఎక్కడ విధులు నిర్వహిస్తున్నారు అనే విషయాలను తెలుసుకునేందుకు ఏ అధికారి పరిధిలోనైన అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుంటే అతడు యాప్‌లోని ఎస్‌వోఎస్ బటన్‌నొక్కితే ఆ అధికారి ఎరుపు రంగులోకి సూచించబడి తద్వారా మొబైల్ పార్టీలు గూగుల్ నామినేషన్ విధానం ద్వారా ఆ ప్రదేశానికి వేగంగా చేరుకొని శాంతిభద్రతలను పరిరక్షిస్తారన్నారు.


ఉప్పలపాడులో టీడీపీ ఏజెంట్లపై దాడి

- ఇరువురికి తీవ్ర గాయాలు

నరసరావుపేట, మే 12 : పోలింగ్‌కు ముందే నరసరావుపేట మండలం ఉప్పలపాడులో వైసీపీ మూకలు రెచ్చిపోయాయి. అర్ధరాత్రి దాడులకు తెగపడ్డాయి. పోలింగ్ బూత్‌లో ఏజెంట్లుగా దరఖాస్తు చేసేందుకు పోలింగ్ బూత్ వద్దకు వచ్చిన టీడీపీ కార్యకర్తలపై వైసీపీకి చెందిన వ్యక్తులు దాడి చేశారు. దరఖాస్తులను లాగేసుకొని వాటిని చించివేశారు. దాడితో ఇరువురు టీడీపీ కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు మహిపతి రామసుబ్బయ్య, కాసా ఆంజేయులు, కాసా రాంబాబులను నరసరావుపేటలోని ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు వారిని పరామర్శిం చారు. ఏకపక్షంగా పోలింగ్ నిర్వహించుకునేందుకే వైసీపీ పథకం ప్రకారం దాడులకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. గ్రామంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి తమకు చెందిన వారిని ఏజెంట్లుగా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించాలన్నారు.



క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న అరవిందబాబు


చెరకు రైతు గుర్తుకే మన ఓటు
రైతుకు ఓటేద్దాం...భవితకు బాటేద్దాం
భారత చైతన్య యువజన పార్టీ
BHARATHA CHAITANYA YUVAJANA PARTY
భారత చైతన్య యువజన పార్టీ
BCY PARTY
వరుస నెం.
అభ్యర్థి పేరు
గుర్తు
బ్యాలెట్ యూనిట్
14
బోడే రామచంద్ర యాదవ్
చెరకు రైతు గుర్తుకే మీ అమూల్యమైన ఓటు వేసి
B.C.Y పార్టీని అత్యధిక మెజారిటీ తో గెలిపించ ప్రార్థన
బోడే రామచంద్ర యాదవ్
మంగళగిరి శాసనసభ నియోజకవర్గం అభ్యర్థి

గుంటూరు రూరల్ వార్తలు

మంగళగిరి తాడికొండ ప్రత్తిపాడు

సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధం

- నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,92,432
- నోటాతో కలిపి బరిలో 41 మంది అభ్యర్థులు
- పోలింగ్ సామగ్రితో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది



ఎన్నికల సిబ్బందికి పోలింగ్ సామగ్రిని అందజేస్తున్న ఆర్వో రాజకుమారి

మంగళగిరి సిటీ, మే 12: సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ సోమవారం జరుగనుంది. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. నియోజకవర్గంలో మొత్తం 2,92,432 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,40,660 మంది, మహిళలు 1,51,759 మంది, ఇతరులు 13 మంది ఉన్నారు. మహిళలు 11,099 మంది ఎక్కువగా ఉన్నారు. మంగళగిరి అసెంబ్లీ బరిలో నోటాతో కలుపుకుని 41 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరిలో జాతీయ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులు నలుగురు, నమోదై గుర్తింపులేని పార్టీల అభ్యర్థులు 14 మంది, స్వతంత్ర అభ్యర్థులు 22 మంది ఉన్నారు. మొత్తం 300 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 41 గుర్తులతో బ్యాలెట్ యూనిట్లు సిద్ధం చేశారు. ఒక్కో యూనిట్‌లో 16పేర్లు మాత్రమే నిక్షిప్తం చేసేందుకు అవకాశం ఉండటంతో 16 మంది చొప్పున రెండు బ్యాలెట్లు, మరో 8 మంది అభ్యర్థులు, నోటాను కలుపుకుని 9 గుర్తులతో మరో బ్యాలెట్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తారు. ఎంపీ అభ్యర్థికి సంబంధించి రెండు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయి. మంగళగిరి నియోజకవర్గానికి సంబంధించి ఈవీఎం, పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆత్మకూరు నిర్మల హైస్కూల్లో ఏర్పాటు చేశారు. 300 మంది పోలింగ్‌స్టేషన్ల సిబ్బందికి ఆదివారం ఇక్కడి నుంచి పోలింగ్ సామగ్రిని పంపిణీ చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాయింట్ కలెక్టరు, మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజకుమారి ఏర్పాట్లను పర్యవేక్షించి అధికార యంత్రాంగానికి పలు సూచనలు చేశారు. కాగా, ఆదివారం మధ్యాహ్నం మంగళగిరిలో గాలివాన కురవడంతో పలు పోలింగ్ కేంద్రాల వద్ద చిత్తడి నెలకొంది. షామియానాలు నేలకొరిగాయి.



ఆత్మకూరు నిర్మల హైస్కూల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి పోలింగ్ సామగ్రిని తీసుకు వెళుతున్న సిబ్బంది

తాడేపల్లిలో పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

తాడేపల్లి టౌన్ / తాడేపల్లి, మే 12: తాడేపల్లి అర్బన్, రూరల్ పరిధిలో మొత్తం 95 బూత్‌లను పోలింగ్‌కు సిద్ధం చేసినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు. అర్బన్ ఏరియలో 53,155 మంది ఓటర్లు ఉండగా, 48 బూత్‌లతోపాటు అదనంగా మరో మూడు బూత్‌లను ఏర్పాటు చేశారు. అలాగే రూరల్‌లో 53,000 ఓటర్లకు గాను 41 బూత్‌లతోపాటు అదనంగా మరో మూడు బూత్‌లను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఆయా బూత్‌ల వద్ద ఏర్పాట్లను సహాయ రిటర్నింగ్ అధికారి బీ శివారెడ్డి సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఆదివారం మధ్యాహ్నానికి అన్ని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది సామగ్రితో సహా చేరుకున్నారు. పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

నులకపేటలో బురదమయమైన పోలింగ్‌కేంద్రం

ఎంటీఎంసీ పరిధిలోని నులకపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి నీరు నిలిచిపోవడంతో పోలింగ్‌కేంద్రం వద్ద ఆవరణ బురదమయంగా మారింది. క్యూలైన్ల వద్ద వర్షపు నీరు నిలిచింది. మళ్లీ వర్షం పడితే పరిస్థితి ఏంటంటూ ఉద్యోగులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నులకపేట జడ్పీ హైస్కూల్లో బురదమయమైన పోలింగ్ కేంద్రం

పోలింగ్ కేంద్రాలకు చేరిన ఎన్నికల సిబ్బంది

ప్రత్తిపాడు, మే 12: నియోజకవర్గంలో పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశారు. అన్ని పోలింగ్‌బూత్‌ల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టెంట్లు ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 288 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికలు జరుగుతుండగా.. ఒక్కో పోలింగ్‌కేంద్రంలో ఒక పీవో, ఒక ఏపీవోతో పాటు నలుగురు ఓపీలను నియమించారని ప్రత్తిపాడు ఆర్వో శ్రీకర్ తెలిపారు. అంతే కాకుండా 32మంది సెక్టార్ ఆఫీసర్స్‌లో ముగ్గురు రిజర్వులో ఉంటారని, అంతే కాకుండా 32 మంది రూట్ ఆఫీసర్స్‌లో ముగ్గురు రిజర్వులో ఉంటారని ఆయన తెలిపారు. 186 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశారన్నారు. ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశారన్నారు. పోలింగ్‌కు సంబంధించి సిబ్బంది అన్ని బూత్‌లలో ఏర్పాట్లు చేసుకున్నారు.



ప్రత్తిపాడులో పోలింగ్‌స్టేషన్‌లకు ఈవీఎంలతో వస్తున్న సిబ్బంది

కాకుమాను, మే 12: సోమవారం జరిగే సార్వత్రిక ఎన్నికల ప్రక్రియకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ పార్వతి తెలిపారు. మండల వ్యాప్తంగా 42 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. కాకుమానులో అత్యధికంగా ఏడు పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. మండలంలో అత్యల్పంగా చిన్నకాకుమానులో 250 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు మండల ప్రజలు, పలు రాజకీయ పార్టీలు సహకరించాలని ఆమె తెలిపారు.

పెదనందిపాడు, మే 12: మండలపరిధిలోని ఆయా గ్రామాలలో సోమవారం జరిగే స్వార్వత్రికల ఎన్నికలకు సర్వం సిద్ధమైనట్లు తహసీల్దార్ లాజరస్ ఆదివారం. 17 గ్రామాల్లో 40 బూత్‌లకు గానూ 35,044 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రానికే ఎన్నికల సామగ్రితో తరలివచ్చారు. మండలంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఉదయం 5 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఆయా రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికలు సక్రమంగా జరిగేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేశాం

● ఆర్వో రాజకుమారి

మంగళగిరి సిటీ, మే 12: నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని మంగళగిరి ఆర్వో రాజకుమారి తెలిపారు. సోమవారం ఉదయం 7నుంచి సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మహిళలు, దివ్యాంగులు, గర్భిణులకు ప్రత్యేక క్యూలైన్లు, వీల్‌ఛైర్ అందుబాటులో ఉంటాయి. ఒక్కో పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, నలుగురు పోలింగ్ అధికారులు, మైక్రో అబ్జర్వర్, వీడియో గ్రాఫర్, పోలీసు సిబ్బంది ఉంటారు. 53 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. అక్కడ సీసీ కెమెరాలు, కేంద్ర సాయుధ బలగాలతో పకడ్బందీ ఏర్పాట్లను చేశాం. మంగళగిరి అసెంబ్లీ స్థానానికి మూడు బ్యాలెట్ యూనిట్లు, పార్లమెంటు స్థానానికి రెండు బ్యాలెట్ యూనిట్లు ఉంటాయి. పోలింగ్‌కేంద్రాల్లో విద్యుత్తు, తాగునీరు, షామియానాలు, క్యూలైన్లు వంటి సౌకర్యాలను కల్పించాం. మాక్ పోలింగ్, యాక్చువల్ పోలింగ్‌పై సిబ్బందికి పూరిస్థాయి శిక్షణ ఇచ్చాం. యాక్చువల్ పోలింగ్ ప్రారంభమయ్యే గంటన్నర ముందు అంటే సోమవారం ఉదయం 5:30గంటలకు మాక్‌పోలింగ్ జరుగుతుంది. అభ్యర్థులు, బూత్ ఏజెంట్లు ఆ సమయానికల్లా అందుబాటులో ఉండాలి. ఏజెంట్లు సకాలంలో హాజరు కాకపోతే 15 నిమిషాల గ్రేస్ పీరియడ్ అనంతరం ప్రిసైడింగ్ అధికారి ఆదేశాల మేరకు మాక్ పోలింగ్ ప్రారంభమవుతుంది. ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం వెల్లడిస్తాం. పెనుమాక, ఇప్పటం గ్రామాల్లో ఒక్కో ఉమెన్ మేనేజింగ్ పోలింగ్‌స్టేషన్, మంగళగిరి రాజీవ్ గృహకల్పలో యూత్ మేనేజింగ్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశాం. వీఐపీల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఎక్కడా ఉండవు. అందరూ లైన్లో నిలబడి ఓటు వేయాల్సిందే. ఓటు వేసేందుకు వచ్చేటప్పుడు సెల్‌ఫోన్లు వెంట తీసుకురావద్దు.. పోలింగ్ కేంద్రంలోకి అనుమతించబడవు.

దుగ్గిరాలలో మహిళల ఓట్లే కీలకం



ఓటింగ్ కోసం బ్యాలెట్ పత్రాలను పరిశీలిస్తున్న పోలింగ్ సిబ్బంది

దుగ్గిరాల, మే 12: నియోజకవర్గంలో ప్రధానంగా గెలుపు, ఓటములు దుగ్గిరాల మండలంపైనే గత మూడుపర్యాయాలు ఆధారపడ్డాయని, మరోసారి ఈ మండలంపైనే అన్ని పార్టీలు దృష్టిసారించాయి. ఓటర్లలో పురుషుల కంటే 1904 మంది మహిళలు ఎక్కువ ఉండటంతో మహిళా ఓట్లే కీలకం కానున్నాయి. మొత్తం 51,726 మంది ఓటర్లుండ గా, 24,924 మంది పురుషులు, 26,828 మంది మహిళలు, ఇతరులు నలుగురు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మండలంలో మొత్తం 58 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం 18 గ్రామ పంచాయతీల్లోని 21గ్రామాల్లో పోలింగ్ జరుగనుంది. మండలవ్యాప్తంగా పోలింగ్‌కేంద్రాల్లో మొత్తం 348మంది సిబ్బంది పోలింగ్ నిర్వహణలో భాగస్వాములు కానున్నారు. ఈవీఎంలు ఆదివారం మధ్యాహ్నం ప్రత్యేక బస్సుల్లో పోలీస్‌సిబ్బంది సహకారంతో ఆయా పోలింగ్‌కేంద్రాలకు చేర్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసి ఎలాంటి తొక్కిసలాట లేకుండా ఏర్పాటు చేశారు.

పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాట్లు పూర్తి

వట్టిచెరుకూరు, మే 12: మండలం పరిధిలోని 17 గ్రామ పంచాయతీల్లో పోలింగ్ నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. మండల వ్యాప్త గ్రామాల్లో 18,474 మంది పురు షులు, 19,697 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియో గించుకోనున్నారు. ఎన్నికల రోజు సోమవారం ఆయా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఆదివారం సాయంత్రం నుంచే గ్రామాల్లో పోలీసులు ప్రత్యేక నిఘాను ఏర్పా టు చేశారు.

141వ పోలింగ్ బూత్‌ను మోడల్ బూత్‌గా గుర్తింపు

లేమల్లెపాడు గ్రామంలోని మండలపరిషత్ స్కూల్లో 140, 141 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. వాటిలో 141వ పోలింగ్‌బూత్ ను మండలంలోని మోడల్ పోలింగ్‌బూత్‌గా ఎన్నికల సంఘం గుర్తింపు నిచ్చినట్లు ఎంపీడీవో, మండల ఎన్నికల నియమావళి అధికారి శేషగిరిరావు తెలిపారు.



పెదపరిమిలో గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ తుషార్ డూడీ

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

● ప్రశాంత పోలింగ్‌కు సహకరించండి.. గ్రామస్థులకు ఎస్పీ సూచన

గుంటూరు, మే 12 : శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, అల్లర్లకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఎస్పీ తుషార్ డూడీ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన తాడికొండ నియోజకవర్గ పరిధిలోని తుళ్ళూరు మండలం పెదపరిమి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అత్యంత సమస్యాత్మక కేంద్రాలైన ఆదిఆంధ్ర న్యూబిల్డింగ్‌లో ఉన్న ఎంపీపీ స్కూల్, సెయింట్ మేరీస్ ప్రైమరీ స్కూళ్లను సందర్శించారు. ఎన్నికల సందర్భంగా తీసుకోవాల్సిన భద్రతాపరమైన చర్యల గురించి గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని గ్రామస్థులకు సూచించారు. బారికేడ్ల ఏర్పాటు, ఓటర్ల రాకపోకలు, పార్కింగ్, ట్రాఫిక్ తదితర విధివిధానాలపై క్షుణ్ణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు.

నియోజకవర్గంలో 244 పోలింగ్ కేంద్రాలు

● పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది ● 2,07,615 మంది ఓటర్లు



లాంలో పోలింగ్ బూత్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్స్, టెంట్లు

తాడికొండ, మే 12: సార్వత్రిక ఎన్నిలకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది ఆదివారం సాయంత్రానికి చేరుకున్నారు. ఈవీఎంలు, ఎన్నికల సామగ్రిని తీసుకుని సిబ్బంది ఆయా పోలింగ్‌బూత్‌లకు చేరుకున్నారు. సోమవారం ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కానున్నది. తాడికొండ నియోజకవర్గంలో 2,07,615 మంది ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో 244 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. వాటిలో తుళ్లూరు మండలపరిధిలో ఉన్న 52 బూత్‌లు ఉన్నాయి. తాడికొండ మండలంలో 66 బూత్‌లు, మేడికొండూరు మండలంలో 60 బూత్‌లు, ఫిరంగిపురం మండలంలో 65 బూత్‌లున్నాయి. ప్రశాంత నిర్వహణకు పోలీసులు, అధికారులు సిద్ధంగా ఉన్నారు.

ఓటుతో బుద్ధి చెప్పాలి : మహిళలు, రైతులు



తాడికొండలో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు, రైతులు

తాడికొండ, మే 12: మూడు రాజధానులు ప్రకటించి, రాజధానిని నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపడానికి రాష్ట్ర ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పాలన్నారు. మూడు రాజధానులకు వ్యతిరేకంగా, రాజధాని రైతులకు మద్దతుగా, బిల్డ్ అమరావతి పేరిట తాడికొండలో రైతులు, మహిళలు, ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు రైతు పక్షపాతినని చెప్పి ఎన్నికల తరువాత అదే రైతులకు మూడు రాజధానుల పేరుతో వెన్నుపోటు పొడిచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రాజధానుల ప్రకటనతో పెట్టుబడులు రాకుండా రాష్ట్రానికి గట్టి దెబ్బ తగిలిందన్నారు.



రూరల్ ఎస్‌ఐ వద్ద పచ్చలతాడిపర్రు గ్రామస్థుల నిరసన, స్టేషన్ ఎదుట గ్రామస్థుల ఆందోళన

టీడీపీ ఏజెంట్లపై వైసీపీ శ్రేణుల దాడులు

- పచ్చలతాడిపర్రులో తీవ్ర ఉద్రిక్తత
- కర్రలు, రాడ్‌లతో సంచరిస్తున్న వైసీపీ శ్రేణులు
- పోలీసుల నిర్లక్ష్యమేనంటూ గ్రామస్థుల ఆందోళన

పొన్నూరు టౌన్, మే 12: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముందు తెలుగుదేశం పార్టీ ఏజెంట్లపై వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడిన సంఘటన పొన్నూరు మండలం, పచ్చలతాడిపర్రు గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పచ్చలతాడి పర్రు గ్రామానికి చెందికు యర్రగుంట నాగార్జున్, పోతన నవతేజ ఏజెంట్ ఫారాలు సమర్పించేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. అదే సమయంలో అక్కడ మాటువేసివున్న వైసీపీ శ్రేణులు ఏజెంట్లపై విచక్షణరహితంగా దాడిచేశారు. అంతేకాకుండా కర్రలతో గ్రామంలో సంచరిస్తూ పోలింగ్ అయిపోయిన తర్వాత ఒక్కొక్కడి అంతు చూస్తామంటూ బెదిరింపులకు దిగారు. గత కొన్నాళ్లుగా తాడిపర్రులో టీడీపీ జెండా దిమ్మెలు కూల్చివేయటం, జెండాలు తగలబెట్టడం, ఓ యువకుడిపై దాడి వంటి వరుస సంఘటనలు గతేడాదిగా చోటు చేసుకుంటున్నాయి. ఈ సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే నిర్లక్ష్య వైఖరి అలంబించటం వల్లనే వైసీపీ అల్లరి మూకలు ఏజెంట్లపై దాడికి తెగబట్టారని టీడీపీ నేతలు పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. మూడు రోజులుగా గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేసి రాత్రివేళ సంచరిస్తూ టీడీపీకి అనుకూలంగా వ్యవహరిస్తే అంతుచూస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు టీడీపీ శ్రేణులు ఆరోపిస్తున్నారు. పోలీసులకు సమాచారం ఇచ్చినప్పటికి బందోబస్తు ఏర్పాటుచేయటం కానీ, అనుమానితులను విచారించటం చేయకపోవటం వల్లనే ఇలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయని నిరసన తెలిపారు. దాడిలో గాయపడిన ఏజెంట్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అసాంఘీక శక్తులను అణిచివేయాలి: ధూళిపాళ్ల



పోలీసులతో మాట్లాడుతున్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, మే 12: పచ్చలతాడిపర్రు గ్రామంలో అసాంఘిక శక్తులను అణిచివేసి శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛాయుతంగా ఎన్నికలు జరపాలని ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. టీడీపీ ఏజెంట్లపై దాడిజరిగిన సంఘటన తెలుసుకున్న నరేంద్ర కుమార్ ఆదివారం రాత్రి పోలీస్‌స్టేషన్‌కు తరలి వచ్చి ఏజెంట్లను పరామర్శించటమే కాకుండా జరిగిన సంఘటన గురించి ఆరా తీశారు. అనంతరం ఎన్నికల విధులో ఉన్న పోలీస్ అధికారులను దాడి సంఘటనపై నిలదీశారు. దాడిజరిగిన తర్వాత ఏజెంట్లు భయభ్రాంతులకు గురై ఎన్నికల్లో పాల్గొనేందుకు భయపడుతున్నారన్నారు. పోలింగ్ స్టేషన్ వద్దే వైసీపీ నాయకులు వీరంగం వేస్తుంటే శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు. పోలీసులకు నరేంద్ర కుమార్‌కు మధ్య సంభాషణలు జరుగుతుండగానే పచ్చలతాడిపర్రు గ్రామంలో వైసీపీ మూకలు కర్రలు, రాడ్లతో దాడికి సిద్ధంగా ఉన్నారని సమాచారం అందటంతో నరేంద్రకుమార్ పోలీసులను ప్రశ్నించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరుపుతారా లేదా అని నిలదీయటంతో ప్రత్యేక ఆర్మ్‌డ్ ఫోర్స్‌ను పచ్చలతాడిపర్రుకు తరలిస్తామని అసాంఘీక శక్తులను అణిచివేస్తామని పోలీసులు హామీ ఇవ్వటంతో నరేంద్రకుమార్ గ్రామస్థులకు నచ్చచెప్పి పంపించారు. గ్రామంలో పోలింగ్ స్టేషన్ల వద్ద ప్రధాన వీధులో 144 సెక్షన్ అమలు చేయటంతోపాటు, అల్లర్లకు దాడులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు గ్రామంలో అర్ధరాత్రి ప్రచారం నిర్వహించారు.



కొల్లిపరలో పోలింగ్‌బూత్‌ల వద్ద ఏర్పాటుచేసిన బారికేడ్లు, టెంట్లు

పోలింగ్‌బూత్‌ల్లో తగిన వసతులు: ఎంపీడీవో

కొల్లిపర, మే 12: మండలంలోని 51 పోలింగ్ బూత్‌లకు అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో విష్ణుప్రసాద్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని వల్లభాపురం, మున్నంగి, కొల్లిపర, తూములూరు, అత్తోట పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విష్ణుప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఓటింగ్ వేసే ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఎన్నికల పోలింగ్ అధికారులకు పోలింగ్‌బూత్‌లలో కావాల్సిన మౌలిక వసతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్‌బూత్‌ల్లో విద్యుత్‌లైట్లు, మంచినీటి వసతి, ఓటర్లు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు టెంట్లు అమర్చడం జరిగిందన్నారు.



పోలింగ్ సామగ్రి సరి చూసుకుంటున్న సిబ్బంది, అవసరమైన చోట్ల రిజర్వ్ సిబ్బందిని నియమిస్తున్న ఆర్వో ప్రఖర్‌జైన్

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు

● పోలింగ్ సామగ్రి పంపిణీ ● తెనాలి నియోజకవర్గంలో 2.65లక్షల మంది ఓటర్లు ● ఉదయం 7 నుంచి పోలింగ్

తెనాలి అర్బన్, మే 12: తెనాలి నియోజకవర్గంలో ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామని రిటర్నింగ్ అధికారి ప్రఖర్‌జైన్ చెప్పారు. జేఎంజే మహిళా కళాశాలలో ఆదివారం సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ చేశారు. 273పోలింగ్ స్టేషన్‌లలో రెండు లక్షల 65వేల863మంది ఉన్నారని తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాలకు సిబ్బందికి అవసరమైన పోలింగ్ మెటీరియల్ పంపిణీ చేశారు. పీవో, ఏపీవో, ఓపీవోలు గైర్హాజరు అయిన చోట రిజర్వ్ సిబ్బందిని నియమించారు. సాయంత్రం ఐదు గంటలకు అన్ని పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకున్నారు. నియోజకవర్గంలో 144 సెక్షన్ విధించారు. ఆయా గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌లలో ఓటర్లు క్యూ పద్ధతిలో ఓటు వేసేందుకు అవసరమైన బారికేడ్లు ఏర్పాటుచేశారు. ఎండ వేడిమిని దృష్టిలో ఉంచుకుని పోలింగ్ స్టేషన్ల ముందు టెంట్లు వేశారు. సెక్టార్లుగా విభజించి ఒక్కో సెక్టారుకు 10 నుంచి 15 పోలింగ్ స్టేషన్‌లకు ఒక సెక్టార్ అధికారిని ఏర్పాటు చేశారు. ఎక్కడైనా ఇబ్బందులు వస్తే పీవో, ఏపీవోలు సెక్టార్ అధికారిని సంప్రదించాలని కోరారు. ప్రజలు నిర్భయంగా ఓటువేయాలని, ఇందుకు అవసరమైన అన్ని పరిస్థితులు కల్పించబడ్డాయని సబ్ కలెక్టర్ పేర్కొన్నారు.

● కొల్లిపర, మే 12: నేడు జరిగే సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రం కొల్లిపర పోలింగ్‌స్టేషన్ తనిఖీలో భాగంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 51 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. మండలవ్యాప్తంగా 45వేల 02 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉందన్నారు. 51 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికల నిర్వహణకు 306 మంది ఉద్యోగస్తులు విధులు నిర్వహించనున్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునే విధంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. కొల్లిపరలో మోడల్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.



ఈవీఎంలను పరిశీలిస్తున్న రాజకీయపార్టీల ప్రతినిధులు, అధికారులు



ఎన్నికల విధుల కోసం విచ్చేసిన అధికారులు



పోలింగ్ బూత్‌లకు ఈవీఎంలతో తరలివెళుతున్న సిబ్బంది

పొన్నూరు నియోజకవర్గంలో...

● ఓటు హక్కు వినియోగించుకోనున్న రూ.2.27లక్షల మంది

పొన్నూరు టౌన్, మే 12: పొన్నూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. సోమవారం జరగనున్న పోలింగ్ ప్రక్రియకు ఆదివారమే అధికారులు పూర్తిస్థాయిలో సన్నద్ధులయ్యారు. పొన్నూరు నియోజకవర్గంలో మొత్తం 2,27,135మంది ఓటర్లు ఉండగా 1,09,008 పురుష ఓటర్లు, 1,18,116మంది మహిళా ఒటర్లు, 11మంది ట్రాన్స్‌జెండర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఈ మొత్తం ఓటర్లలో 2412మంది పోస్టల్ బ్యాలెట్ ఓటు వినియోగించుకోవలసివుండగా 2209మంది ఓటర్లు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకొని ఓటువేశారు. నియోజకవర్గంలోని పొన్నూరు, చేబ్రోలు, పెదకాకాని మండలాలతోపాటు పొన్నూరు పురపాలక సంఘంలో 142 పోలింగ్ కేంద్రాల పరిధిలో 264 పోలింగ్ బూతులు ఉన్నాయి. ఈ పోలింగ్ బూత్‌లలో 52కేంద్రాలు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించారు. 228 పోలింగ్ బూత్‌లను వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్ ప్రక్రియను పరిశీలించేదుకు ఏర్పాట్లుచేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో మైక్రోఅబ్జర్వలను నియమించి పోలింగ్ ప్రక్రియ ముగిసేవరకు పరిశీలించేందుకు ఏర్పాట్లు జరిగాయి. ఒకో పోలింగ్ బూత్‌లో పోలింగ్ ఆఫీసర్ అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్, ముగ్గురు సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. 264మంది పోలింగ్ ఆఫీసర్లు 264 మంది అసిస్టెంట్ పోలింగ్ ఆఫీసర్లు, 792మంది అదర్ పోలింగ్ ఆఫీసర్లు విధులు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరిగాయి. నియోజవకర్గంలో 7 నోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పెదకాకాని మండలంలోని కొప్పురావూరు గ్రామంలో 1వ నెంబరు బూత్‌ను నోడల్ బూత్‌గా, 2వ బూత్‌ను ప్రత్యేక మహిళా పోలింగ్ బూత్‌గా ఏర్పాటు చేశారు. చేబ్రోలు, మునిపల్లె, పురపాలక సంఘంలోని 1వ బూత్‌ను నోడల్ బూత్‌గా తీర్చిదిద్దారు. వీరే కాకుండా పోలీసులు, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్ఠ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారు. ఓటు వేసేందుకు అనవరమైన క్యూలైన్లు, ఓటర్ల ఎండవేడి నుంచి ఉపశమనం పొందేలా టెంట్‌లను ఏర్పాటుచేశారు. పోలింగ్ బూత్‌ల వద్ద తాగునీరు, పారిశుధ్య, వైద్య సేవలు అందించేలా ఏర్పాట్లు జరిగాయి. దివ్యాంగులు, ఓటు హక్కును వినియోగించుకునేదుకు పోలింగ్ బూత్‌లలో వెళ్లేలా ర్యాంప్‌లను ఏర్పాటు చేశారు.

పోలింగ్ కేంద్రాలకు తరలిన సిబ్బంది...

నియోజవర్గంలలో ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు జరిగాయి. పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఎన్నికల అధికారి ఏ లక్ష్మీకుమారి, ఏఈఆర్వో హరిహరనాథ్ ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందికి అవసరమైన సామగ్రితోపాటు, ఈవీఎంలు, వీవీప్యాట్‌లు అందించారు. పోలింగ్ సిబ్బంది, పోలింగ్ బూత్‌ల వద్దకు వెళ్లేలా 72 ఆర్టీసీ బస్సులను, ప్రైవేటు పాఠశాలల బస్సులను అధికారులు వినియోగించుకున్నారు. ఎండవేడి అధికంగా ఉండటంలో సిబ్బంది తరలివెళ్లేందుకు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

బరిలో 14 మంది....

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పొన్నూరు అసెంబ్లీ బరిలో 14మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. తెలుగుదేశం కూటమి అభ్యర్థిగా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ, కాంగ్రెస్ అభ్యర్థిగా జక్క రవీంద్రనాథ్, బీఎస్పీ అభ్యర్థిగా యాతాటి కిషోర్, పిరమిడ్ పార్టీ అభ్యర్థిగా జె రమేష్, జై భారత్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వరికుంట రోశయ్య, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా షేక్ మస్తాన్ వలి, జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా మొద్దు సాంబశివరావు, రిఫార్మ్ పార్టీ అభ్యర్థిగా అక్కిదాసు జోసఫ్, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ అభ్యర్థిగా గోన రాబర్ట్, వీసీకే పార్టీ అభ్యర్థిగా కూరపాటి మాణిక్యరావు, ఇండియన్ లేబర్ పార్టీ అభ్యర్థిగా జీజే శ్యామ్యూల్, స్వతంత్య అభ్యర్థులుగా డి.వాసుదేవరావు, అడాల లక్ష్మయ్య ఎన్నికల బరిలో ఉన్నారు. ప్రధాన పోటీ మాత్రం టీడీపీ, వైసీపీ అభ్యర్థుల మధ్యే సాగనున్నది.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాం

● డీఎస్పీ రమేష్‌బాబు



తెనాలి రూరల్, మే 12: డివిజన్ వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టామని డీఎస్పీ రమేష్‌బాబు చెప్పారు. డివిజన్‌లో ఎన్నికల విధులు నిర్వహించే పోలీస్ యంత్రాంగంతో డీఎస్పీ రమేష్‌బాబు ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించి చేపట్టవలసిన చర్యలపై పోలీసులకు పలు సూచనలు చేశారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ డివిజన్‌లోని ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అన్ని చర్యలు చేపట్టామన్నారు. అందులో భాగంగా 254మంది రౌడీషీటర్లను బైండోవర్‌చేసి గతంలో జరిగిన ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలవద్ద ఇతర ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించిన వారిని సైతం గుర్తించి బైండోవర్ చేయడం జరిగిందన్నారు. డివిజన్‌వ్యాప్తంగా 40 పోలింగ్ కేంద్రాలు సమస్యాత్మకంగా గుర్తించామని అక్కడ సీసీ కెమెరాలు, వీడియోగ్రాఫర్, ప్రత్యేక పోలీస్ బలగాలతో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు బిగించడం జరిగిందని, 100 మీటర్ల దూరం వరకూ ఎటువంటి వాహనాలు, గుంపులుగా ప్రజలను అనుమంతించేది లేదన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్, పోలీస్ యాక్టు అమలులో ఉంటుందన్నారు. ఓటర్ల స్లిపులు ఇచ్చేవారికి సైతం పోలింగ్ కేంద్రాలవద్ద అనుమతులు లేవన్నారు. ఇవేకాక 25 మొబైల్ వెహికల్స్ ద్వారా పోలీసులు ఆయా మార్గాల్లో సంచరిస్తూ భద్రతాపరమైన చర్యలు తీసుకుంటారన్నారు. ఇప్పటికే ఎన్నికల్లో విధులు నిర్వహించేందుకు 500మంది పోలీసులను, ప్రత్యేక బలగాలను కూడా ఏర్పాటు చేశామన్నారు. అవసరాన్ని బట్టి మరింతమందిని విధుల్లో ఉంచేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. పోలింగ్ కేంద్రాల సమీపంలోని అపార్ట్‌మెంట్ వాసులకు ముందుగా నోటీసులు ఇచ్చామని అపరిచితులను అందులోకి అనుమతివ్వకూడదని చెప్పడం జరిగిందన్నారు. ఓటుహక్కు ఉన్నవారు తప్ప మరే ఇతర వ్యక్తులు పోలింగ్ కేంద్రాల వద్దకు రాకూడదన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చేవారు వాహనాలను తప్పనిసరిగా 100మీటర్ల దూరంలో పార్క్ చేసుకోవాలని సెల్‌ఫోన్లు కేంద్రాలోకి అనుమతించబడవన్నారు. ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రజలు పోలీసులకు సహకరించాలని రమేష్‌బాబు విజ్ఞప్తి చేశారు. రాజకీయ నాయకులు, కార్యకర్తలు సైతం ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా వారి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు సహకరించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా అల్లర్లకు పాల్పడినా, ఓటర్లను ఇబ్బందులకు గురిచేసినా అటువంటి వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల చుట్టూ సీసీకెమెరాలు ఉన్నాయని వాటి ద్వారా ఎప్పటికప్పుడు ఒక బృందం పరిశీలిస్తూ ఉంటుందని, ఎక్కడా కూడా అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీస్‌శాఖపరంగా చేపట్టాల్సిన చర్యలను చేపట్టామని ఆయన తెలియజేశారు. ఆయన వెంట పలువురు సీఐలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను భక్తిమార్గంలో నడిపించిన జగద్గురు

● పట్టణ బ్రాహ్మణపరిషత్ అధ్యక్షుడు వెంకటరామ్‌గోపాల్

తెనాలి రూరల్, మే 12: ఆధ్యాత్మిక ప్రవచనాలతో ప్రజలను భక్తిమార్గంలో నడిపించిన జగద్గురువు శ్రీ ఆదిశంకరాచార్యులని పట్టణ బ్రాహ్మణపరిషత్ అధ్యక్షుడు పరాశరం వెంకటరామ్‌గోపాల్ చెప్పారు. ఆదివారం శ్రీ జగద్గురు ఆదిశంకరాచార్యుల వారి జయంతిని పురస్కరించుకుని బ్రాహ్మణపరిషత్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి సభ్యులు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పరిషత్ ప్రధాన కార్యదర్శి పురుషోత్తమ శర్మ మాట్లాడుతూ యావత్ భారతావనిలో పర్యటించి దేశవ్యాప్తంగా నాలుగు పీఠాలు స్థాపించి అద్వైత సిద్ధాంతాన్నిజాతికి అందించి సనాతన ధర్మపరిరక్షణకోసం అవతరించిన మహనుభావుడు ఆది శంకరాచార్యులవారని కొనియాడారు. పౌరోహిత్యానికి ఆదిశంకరుడే తొలిగురువని చెప్పారు. సమాజంలో సనాతన ధర్మాన్ని నెలకొల్పేందుకు ఉద్భవించిన మహనీయుడని ఆయన ప్రవచనాలతో ప్రజల్లో ఆధ్మాత్మికతను పెంపొందించారని కొనియాడారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ భాను, గౌరవాధ్యక్షుడు పెద్దిరాజు సత్యనారాయణ, బ్రాహ్మణ క్రెడిట్ కో ఆపరేటీవ్ సొసైటీ డైరెక్టర్ ఎస్‌ఆర్‌కె శర్మ, త్రిపురాభట్ల దత్తు, చెన్నాప్రగడ శ్రీనివాస్, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లక్కరాజు లక్ష్మణశాస్త్రీ, మన్నెపల్లి ఆదిశేషగిరిరావు, దావులూరి శ్యామ్‌సుందర్, సీహెచ్ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఆదిశంకరాచార్యుల చిత్రపటానికి పూజలు చేస్తున్న బ్రాహ్మణపరిషత్ సభ్యులు